



● కోటప్పకొండ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

- సీనరేజి బిల్లు ఉంటేనే లారీ కదిలేది
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో మాఫియాకు చెక్
- ప్రభుత్వ నిర్ణయంపై కోటప్పకొండలో క్రషర్ల నిర్వాహకుల నిరసన
- లారీ కంకర రూ.2500 నుంచి రూ.3 వేల పెరుగుదల
- అమాంతం పెరిగిన ధరలతో నిర్మాణదారులపై ఆర్థిక భారం

మళ్లీ చెక్‌పోస్టులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం ప్రైవేట్ చెక్ పోస్టులు నిలిచిపోవడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూడు నెలలుగా మట్టి మాఫియా బరి తెగించింది. అక్రమ మైనింగ్ పెద్దఎత్తున జరుగుతోంది. ఎటువంటి అనుమతులు లేకుండానే కొండలు, గుట్టలను కొల్లకొడుతున్నారు. దీనిని కట్టడి చేసేందుకు ప్రైవేటు చెక్‌పోస్టులను తిరిగి కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో అక్రమార్కుల గొంతులో వెలక్కాయపడింది. ఈ పరిస్థితుల్లో సీనరేజి వసూలు ప్రైవేటీకరణను కొనసాగించాలని కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని, చెక్‌పోస్టుల ఏర్పాటును నిరసిస్తూ వివిధ ప్రాంతాల్లో క్రషర్ల నిర్వహకులు కంకర సరఫరాను నిలిపివేశారు. కోటప్పకొండలో క్రషర్ల నిర్వహకులు సమ్మె చేపట్టారు. వీరు ప్రైవేట్ చెక్‌పోస్టులను వ్యతిరేకిస్తున్నారు. చెక్‌పోస్టుల నిర్వహణతో భవన నిర్మాణ మెటీరియల్ ధరలు అమాంతం పెరిగాయి. లారీ కంకర ధర రూ.2500 నుంచి రూ.3 వేలకు పెరిగింది. లారీ గ్రావెల్ ధర కూడా రూ.2 వేల వరకు పెరిగింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో మైనింగ్ లీజు టెండర్‌ను ఓ సంస్థ ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో సుమారు రూ.250 కోట్లకు దక్కించుకుంది. లీజు పొందిన సంస్థ ఉమ్మడి గుంటూరు జిల్లా అంతటా విస్తృతంగా సీనరేజి తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఎన్నికల ఫలితాల అనంతరం సీనరేజి వసూళ్లను ఆపేసింది. దీంతో ప్రభుత్వ భూముల్లో, చెరువుల్లో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. మూడు నెలలుగా రూపాయి కూడా చెల్లించకుండా అధికార పార్టీ అండతో మట్టి అక్రమ వ్యాపారాన్ని సాగించారు. ఈ పరిస్థితుల్లో అక్టోబరు వరకు మైనింగ్ సీనరేజి టెండర్ కాల వ్యవధి ఉన్నట్లు అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ పరిస్థితుల్లో అక్రమార్కులకు చెక్ పెట్టడంతో పాటు తవ్వకాల ను కట్టడి చేసేందుకు మైనింగ్ శాఖకు ప్రభుత్వం అనుమతించింది. దీంతో మైనింగ్ చేసినా సీనరేజి చెల్లించకుండా రవాణా చేసే పరిస్థితి లేకుండా మైనిం గ్‌శాఖ పాత విధానాన్ని కొనసాగించింది. దీంతో మళ్లీ ఎక్కడికక్కడ ప్రైవేట్ చెక్‌పోస్టుల నిర్వహణ అమల్లోకి వచ్చింది. పాత పద్ధతి లోనే కాంట్రాక్టర్ సీనరేజిని వసూలు చేపట్టారు. దీంతో మూడు నెలలుగా యథేచ్ఛగా మట్టి వ్యాపారం చేపట్టిన అధికారపార్టీకి చెందిన కొంద రు అక్రమార్కులు కంగుతిన్నారు. తనిఖీ కేంద్రాల ఏర్పా టును జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రభు త్వానికి చెల్లించే సొమ్మును వినియోగదారుల నుంచి వసూలు చేస్తు న్నారు. సీనరేజి తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేయగానే మట్టి ధరలను పెంచేశారు. గతంలో లారీ మట్టి ధర రూ.6 వేల వరకు ఉండేది దీనిని రూ.8 వేలకు పెంచి నట్లు కొనుగోలు దారులు తెలిపారు. కంకర కొంత జీరోపైనే విక్రయించే వారు. కంకరకు కూడా సీనరేజి తప్పని సరి కావడంతో ట్రాక్టర్ కంకర ధరను రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచారు. గతంలో కోట ప్పకొండ ప్రాంతంలో లారీ కంకర ధర రూ.8 వేలు ఉం డేది చెక్‌పోస్టుల నిర్వహణతో ఈ ధర రూ.3 వేల వ ర కు పెరిగింది. ఈ భారం నిర్మాణ రంగంపై పడుతున్నది.

నెలకు రూ.20 కోట్ల ఆదాయం

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మైనింగ్‌కు సంబంధించిన సీనరేజిని పూర్తిగా ప్రైవేటీకరించారు. దీని వల్ల అక్రమాలను కొంత మేర నిరోధించడంతో పాటు ప్రభుత్వానికి నెలకు దాదాపు రూ.20 కోట్ల వరకు ఆదాయం వస్తుందని అంచనా. సిమెంట్ కంపెనీలకు సర ఫరా అయ్యే రాయికి, ఇసుకకు నూతన సీనరేజి విధానంలో మి నహాయింపు ఇచ్చారు. సున్నపురాయి, మట్టి, కంకర, కంకర డస్ట్, రోబో ఇసుక, గ్రానైట్‌కు సంబంధించి సీనరేజిని వసూలు చేసుకునే హక్కును కాంట్రాక్టర్‌కు కల్పించారు. ఒక్క దాచేపల్లి ప్రాంతంలోనే ఆరు తనిఖీ కేంద్రాలను సదరు సంస్థ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. మైనింగ్ జరిగే ప్రాంతాల్లో తనిఖీ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఈ విధానాన్ని అడ్డుకునేందుకు అక్రమార్కులు అధి కార పార్టీలోని కొందరు పెద్దలతో లాబీయింగ్ చేస్తున్నట్లు సమాచారం.

ప్రైవేటీకరణ కొనసాగింపు

ఇష్టం వచ్చినట్లు తవ్వుకుంటాం.. తరలిస్తాం.. అంటే వీలుకాదు. అనుమతులు అవసరం లేదు.. అధికారం మాదే అంటే ఇక కుదరదు. సీనరేజి బిల్లు ఉంటేనే లారీ కదులుతుంది.. లేదంటే కష్టమే. మైనింగ్ మాఫియాకు చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం రంగంలోకి దిగింది. సీనరేజి వసూలు బాధ్యతను మళ్లీ ప్రైవేటీకరించింది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ మళ్లీ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసుకునేం దుకు మైనింగ్‌శాఖ అనుమతి ఇచ్చింది. సీనరేజి వసూలు ప్రైవేటుకు అప్పగించడంతో అక్రమార్కులు కంగు తిన్నారు. ఎక్కడికక్కడ చెక్‌పోస్టుల ఏర్పాటుతో అక్రమ మైనింగ్‌కు కట్టడి పడిం ది. మట్టి, గ్రావెల్, కంకర అక్రమ తవ్వకాలు ఆగాయి. చెక్‌పోస్టుల కొనసా గింపును నిరసిస్తూ కంకర సరఫరాను క్రషర్ల నిర్వహకులు నిలిపివేశారు. దీంతో కంకర, గ్రావెల్ ధరలకు రెక్కలు వచ్చాయి.

పొరుగు జిల్లాలో వసూలు లేదు..

పొరుగున ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సీనరేజి వసూలు ప్రైవేటీకరించలేదు. వైసీపీ ప్రభుత్వ హయంలో మాజీ ఎమ్మెల్యే బాలినేని ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సీనరేజ్ ప్రైవేటీకరించకుండా అడ్డుకున్నారు. దీని వల్ల ఆ జిల్లాలోని స్టోన్‌క్రషర్లు, గ్రానైట్ పరిశ్రమల నిర్వాహకులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సీనరేజి ప్రైవేటీకరించడంతో పూర్తి స్థాయిలో వసూలు జరుగుతోంది. ఉదాహరణకు యేల్చూరు ప్రాంతంలోని స్టోన్‌క్రషర్ల నిర్వాహకులు కంకర సీనరేజ్ లేకుండా విక్రయిస్తున్నారు. ఇక్కడి నిర్మాణదారులు అక్కడ కంకర కొనుగోలు చేసి చెక్ పోస్టులు లేని రహదారుల గుండా తరలిస్తున్నారు. తక్కువ ధరకు లభిస్తుండటంతో అక్కడ కంకర కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని వ్యాపారులు నష్టపోతున్నారు. పొరుగు జిల్లా సరిహద్దులోని మార్టూరు, యేల్చూరు ప్రాంతాల్లో కంకర కొనుగోలు చేస్తే లారీకి రూ.3నుంచి రూ.4 వేల వరకు ధర తగ్గుతుందని కొనుగోలుదారులు చెప్తున్నారు. ఈ విధానాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాపారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.



ఈమని సమీపంలో ప్రమాదానికి గురైన వల్లభాపురం-గుంటూరు ఆర్టీసీ బస్సు

- రీజియన్‌లో సగానికిపైగా మరమ్మతుల్లోనే..
- గత ప్రభుత్వంలో బస్సుల నిర్వహణపై నిర్లక్ష్యం
- మార్గమధ్యలో తరచూ మొరాయిస్తున్న పలు బస్సులు
- 15 లక్షల కీమీ తిరిగిన 20 శాతం బస్సులు ఇంకా రోడ్లపైనే
- కమాన్ కట్ట విరగడంతో ఈమని వద్ద కాల్వలోకి దూసుకెళ్లిన బస్సు



డొక్కు బస్సులతో.. డేంజర్

గుంటూరు, సెప్టెంబరు 15: నిర్వహణ లేదు.. మరమ్మతులు మరిచారు.. స్ర్కాబ్‌కు వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సులు ఇంకా రోడ్లపైనే.. డొక్కు బస్సుల్లో ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. ఆదివారం కొల్లిపర మండలం మున్నంగి నుంచి గుంటూరు వస్తున్న బస్సు కమాన్‌కట్టలు విరిగిపోయి దుగ్గిరాల సమీపంలోని ఈమని వద్ద పొలాల్లోకి దూసుకెళ్ళిన సంఘటన ఆర్టీసీ బస్సుల తీరును తెలియజేస్తుంది. 30 మంది ప్రయాణికులు ఉన్న బస్సు ప్రమాదానికి గురి కావడంతో గుంటూరు డిపో అధికారులను ఉలికిపాటుకు గురిచేసింది. గుంటూరు నుంచి వయా దుగ్గిరాల, ఈమని, వల్లభాపురం మున్నంగికి రాకపోకలు సాగించే బస్సు సాంకేతిక లోపంతో పొలాల్లోకి దూసుకెళ్లడంతో ప్రయాణికులు భయాందోళనలకు లోనయ్యారు. బస్సు కింది భాగంలో కమాన్ కట్టకు ఉంటే షాకిల్ పిన్ అరిగిపోవడంతో ఊడి బస్సు ఒక పక్కకు లాగిందని ప్రాథమిక విచారణలో తేలినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం తెలిపారు. డొక్కు బస్సులతోనే ఇలాంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఆర్టీసీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో 980కు పైగా బస్సులు ఉంటే వాటిలో సగంపైన డొక్కువే. నిర్వహణా లోపం, సరైన మరమ్మతులు లేకపోవడంతో రీజియన్ పరిధిలో ఎక్కడోఒక దగ్గర బస్సులు మొరాయిస్తుండటం పరిపాటిగా మారింది. కొన్ని ఆర్డినరీ బస్సుల్లో కనీసం కిటికీలకు అద్దాలు కూడా లేవంటే ఆశ్చర్యం కాదు. పైగా కిటికీలు, డోర్‌లు, రేకుల శబ్దాలతో తలనొప్పి, ఒళ్ళు నొప్పులతో అస్వస్థతకు గురవ్వాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. పంక్చర్లు పడితే టైరు మార్చాలన్నా టూల్స్ ఉండటం లేదని సిబ్బంది వాపోతున్నారు. దూర ప్రాంత బస్సులకు మాత్రమే టూల్స్ అందుబాటులో ఉంచుతున్నారు. నిబంధనల మేరకు 12 లక్షల కిలో మీటర్లు తిరిగిన బస్సులను స్ర్కాబ్ చేయాలి. అయితే ఈ నిబంధనలు గుంటూరు రీజియన్ పరిధిలోని ఏ డిపోలోనూ పాటించడం లేదు. రీజియన్‌లో 20 శాతంపైన బస్సులు 15 లక్షల కిలో మీటర్లు తిరిగినవే ఉన్నాయన్న విమర్శలున్నాయి. ఇటీవల తరచూ మెట్రో బస్సులు కూడా మరమ్మతులకు గురవుతున్నా కనీసం వాటికి కావాల్సిన స్పేర్స్ అందించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తుందని సమాచారం. దాదాపు 100 బస్సులను గతంలో స్ర్కాబ్ చేసినట్లు చెబుతున్నారు. కానీ వాటి స్థానంలో ఒక్క కొత్త బస్సు వచ్చిన పరిస్థితి లేదు. గతంలో గుంటూరు నుంచి సచివాలయ సిబ్బందిని తీసుకెళుతున్న ఓ బస్సు మందడం సమీపంలో అర్థాంతరంగా నిలిచిపోయింది. దాంతో చేసేది లేక సచివాలయ సిబ్బంది మరో బస్సు ఎక్కి విధులకు వెళ్లాల్సి వచ్చింది. ఉదయం సంఘటన జరిగితే సాయంత్రం వరకు ఆ బస్సును పట్టించుకున్న నాథుడే లేడు. ఇటీవల రీజియన్ పరిధిలో తరచూ రిపేర్లతో బస్సులు మార్గమధ్యలో నిలిచిపోతున్న సంఘటనలున్నాయి. ఈమని దుర్ఘటనతో గ్యారేజ్ సిబ్బంది నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందన్న విమర్శలున్నాయి. నిర్వహణలో షెడ్యూల్ 3లో కమాన్ కట్టలు, బ్రేక్ డ్రమ్ములు, టైర్లు, స్టీరింగ్ జాయింట్లు, విద్యుత్ వైరింగ్ రిపేర్లు వంటివి చేయాలి. అయితే వీటి గురించి పట్టించుకునే వారే లేకపోవడంతో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయన్న ఆరోపణలున్నాయి. ఈమని వద్ద బస్సు పొలం వైపునకు ఒరిగిపోయి ఘటనలో ఎవ్వరికీ ప్రమాదం జరగలేదని అయినా దీనిపై విచారణ చేయిస్తామని గుంటూరు -2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం తెలిపారు.

సూర్యలంక తీరంలో పర్యాటకుల సందడి



సూర్యలంకకు.. మహర్దశ

- బీచ్‌లో వసతుల కల్పనకు పెద్దపీట
- తీరంలో అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు
- పర్యాటక రంగ పురోగమనంపై రాష్ట్ర ప్రభుత్వం చూపు

బాపట్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా గోవాగా ప్రసిద్ధి చెంది.. విశాలమైన తీరం.. మడ అడవుల అందాలతో అలరారే సూర్యలంక బీచ్‌కు మహర్దశ పట్టనున్నది. పర్యాటకులతో కళకళలాడే బీచ్‌ల్లో ఒకటిగా ఉన్న సూర్యలంక అభివృద్ధిపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా దృష్టి సారించాయి. టూరిజం అభివృద్ధికి ఎక్కువ అవకాశాలు ఉన్న ప్రాంతాలు గుర్తించే క్రమంలో జిల్లాలోని సూర్యలంక తీరాన్ని కూడా పర్యాటకరంగానికి అనుకూలమైన ప్రాజెక్టుగా గుర్తించారు. పర్యాటక రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంచుకున్న అతి కొద్ది ప్రాజెక్టుల్లో సూర్యలంక బీచ్‌కు కూడా స్థానం దక్కింది. ఈ క్రమంలో రూ.వంద కోట్ల వరకు ఖర్చు చేసి సూర్యలంక బీచ్‌ను పర్యాటక రంగ పరంగా అభివృద్ధి చేయాలని నిర్ణయానికి వచ్చారు. నిధుల విడుదలకు కేంద్ర ప్రభుత్వం సైతం పచ్చజెండా ఊపింది. ఇందుకు సంబంధించి త్వరలోనే విధివిధానాలు విడుదల కానున్నాయని సమాచారం. పర్యాటక రంగం అభివృద్ధికి విరివిగా అవకాశాలు ఉన్న దృష్ట్యా సూర్యలంక బీచ్‌కు సంబంధించి అధికారులు ప్రభుత్వానికి ప్రాథమికంగా నివేదికలను పంపించారు. సూర్యలంక తీరానికి పెట్టని కోటగా ఉన్న మడ అడవులు సహజసిద్ధమైన ప్రకృతి అందాలకు నెలవుగా ఉన్నాయి. పర్యాటకరంగ అభివృద్ధిలో భాగంగా ఈ అందాలకు మెరుగులు దిద్దితే పర్యాటకులు పోటెత్తుతారు. సూర్యలంక తీరానికి ఆటవిడుపు కోసం పెద్ద ఎత్తున వచ్చే పర్యాటకులకు వసతుల విషయంలో పెద్దపీట వేసే దిశగా నిధులు వెచ్చించనున్నారు. వాటర్ గేమ్స్‌తో పాటు స్పీడ్‌బోటింగ్ సౌకర్యాలను కల్పించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. డార్మిటరీ తరహాలో బీచ్‌లో విశ్రాంతి గృహాలతో పాటు తాగునీరు, మరుగుదొడ్ల కల్పనకు ప్రాధాన్యమిచ్చేలా ప్రణాళికలు తయారు చేస్తున్నారు. వీటితో పాటు భద్రతను అత్యంత ప్రధానంగా భావించి ప్రమాదాలను అరికట్టి పర్యాటకులను కాపాడడానికి అధునాతన టెక్నాలజీని అందిపుచ్చుకునే దిశగా అడుగులు పడనున్నాయి. ఇందులోభాగంగా మానవరహితంగా రిమోట్ ద్వారా నియంత్రించే బోట్లను వినియోగించడానికి కసరత్తు చేస్తున్నారు. సూర్యలంక బీచ్‌కు బ్లూఫ్లాగ్ హోదా కల్పించడంతో పాటు బీచ్‌లో ఉన్న సౌకర్యాలపై విస్తృత ప్రచారం కల్పిస్తే పర్యాటకుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే ప్రైవేటు రిసార్టులు పెద్దసంఖ్యలో ఉన్నాయి. అయితే వాటి అద్దెలపై నియంత్రణ లేకపోవడంతో పర్యాటకుల జేబులకు చిల్లు పడుతుంది. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న రిసార్టులలో ఒక్కటి మాత్రమే సూర్యలంక తీరంలో ఉంది. పర్యాటక శాఖ వైపునుంచి మరిన్ని రిసార్టులు రావాల్సిన అవసరం ఉంది. తీర ప్రాంతాలకు అనుసంధానిస్తూ రోడ్ల నిర్మాణం మీద దృష్టిపెడితే బీచ్‌కు ఆదరణ ఇంకా పెరిగే అవకాశం ఉంది. బీచ్‌లో రక్షణతో పాటు పర్యాటకులు దోపిడీకి గురికాకుండా చూడాల్సిన బాధ్యత కూడా ఉంది.

గతంలో హామీలతో సరి..

సూర్యలంక తీర ప్రాంత అభివృద్ధిపై గత ప్రభుత్వం దృష్టిపెట్టిన దాఖలాలు లేవు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క రూపాయి విదిల్చిన దాఖలాలు లేవు. అప్పటి పర్యాటక శాఖ మంత్రి రోజా తీరానికి వచ్చి హామీలు అయితే ఇచ్చి వెళ్లారు తప్పితే అడుగు ముందుకు పడలేదు. వైసీపీ హయాంలో దాదాపు కోటిన్నర రూపాయల ప్రతిపాదనలతో సూర్యలంక బీచ్ అభివృద్ధికి అప్పటి కలెక్టర్ విజయకృష్ణన్ డీపీఆర్‌లను పంపించారు. కానీ వాటిపై కదలికే కరువైంది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే పర్యాటక రంగం అభివృద్ధిపై దృష్టి పెట్టడం, అధికారులు పంపిన నివేదికలకు ప్రా ముఖ్యత ఇస్తూ అభివృద్ధికి సూర్యలంకను ఎంపిక చేసుకోవడంపై జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మరో 30.3 కిమీ రైల్వేట్రాక్

నడికుడి-శ్రీకాళహస్తి మార్గంలో నిర్మాణం

గుంటూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని నడికుడి - శ్రీకాళహస్తి కొత్త రైలు మార్గంలో మరో సెక్షన్ నిర్మించేందుకు మార్గం సుగమమైంది. ఇప్పటికే ఈ మార్గంలో న్యూ పిడుగురాళ్ల నుంచి గుండ్లకమ్మ వరకు పనులు పూర్తి అయిన విషయం తెలిసిందే. గుండ్లకమ్మ - కనిగిరి మధ్య వేగవంతంగా పనులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కనిగిరి నుంచి పామూరు వరకు 30.3 కిలోమీటర్ల పొడవునా మరో సెక్షన్ పూర్తికి రైల్వే సంకల్పించింది. ఇందుకోసం అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్ నుంచి కేటాయించింది. దీంతో జోనల్ అధికారులు టెండర్ ప్రక్రియ ప్రారంభించారు. కాగా 2022లో దీనిపై కేంద్ర ప్రభుత్వం సమీక్ష జరిపి సొంత నిధులతోనే ఈ రైలుమార్గం నిర్మాణం పూర్తి చేయాలని సంకల్పించింది. ప్రస్తుతం అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వాలు పరిపాలన సాగిస్తుండటంతో ఈ ప్రాజెక్టుపై సమీక్ష జరిపి తాజాగా రూ.391.44 కోట్లు మంజూరు చేసింది.

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్



లెటర్ రిపీటెడ్ సిరీస్

వివిధ రకాలైన సిరీస్ పద్ధతులు:

1. **abc/bca/cab/abc.**
మొదటి సమూహంలో చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఉన్నది. రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఉన్నది. ఈ విధంగా ఒక క్రమపద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.
2. **aaa/bbb/ccc/aaa**
ప్రతి సమూహంలో ఒక అక్షరమే మూడుసార్లు ఉన్నది.
3. **acac/abab/acac/abab**
acac/abab అనే అక్షరాల సమూహాలు రెండుసార్లు రిపీట్ అయ్యాయి.
4. **ab/aab/aaab/aaaab**
రెండో సమూహాన్ని పరిశీలిస్తే రెండో సమూహం నుంచి ప్రతి సమూహంలోను దాని ముందు సమూహంలోని అక్షరాలతోపాటు ఒక 'a' అదనంగా చేరుతున్నది.
5. **abca/abcb/abcc/abca**
ప్రతి సమూహంలోను మొదటి మూడు అక్షరాలుగా abcలే రిపీట్ అయ్యాయి. మొదటి సమూహంలో చివరి అక్షరంగా a, రెండో సమూహంలో చివరి అక్షరంగా b, మూడో సమూహంలో చివరి అక్షరంగా c ఉన్నది. ఈ విధంగా కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.
6. **abcd/bcda/cdab/dabc/adcb.**
మొదటి సమూహంలో చివరి మూడు అక్షరాలు రెండో సమూహంలో మొదటి మూడు అక్షరాలుగా, మొదటి సమూహంలో ఒకటో అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఉన్నది. రెండో సమూహంలో చివరి మూడు అక్షరాలు మూడో సమూహంలో మొదటి మూడు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఉన్నది. ఈ విధంగా ఒక సక్రమమైన చెయిన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.
7. **PQQ/QRR/RPP/PQQ**
ప్రతి సమూహంలో చివరి రెండు అక్షరాలు ఒకటే.
8. **aab/bbc/cca/aab**
ప్రతి సమూహంలో మొదటి రెండు అక్షరాలు ఒకటే.
9. **ab/abb/abbb/abbbb**
రెండో సమూహాన్ని పరిశీలిస్తే రెండో సమూహం నుంచి ప్రతి సమూహంలోను దాని ముందు సమూహంలోని అక్షరాలతో పాటు ఒక 'b' అదనంగా చేరుతున్నది.

ప్రతి సమూహంలో ఒకే విధమైన అక్షరాలు రిపీట్ అవుతున్నాయి. ఇలాంటి సందర్భాలలో ప్రశ్నలకు సమాధానం రాబట్టడానికి కింద తెలిపిన విధానాన్ని అనుసరించవచ్చు.

ఉదా: P - R - Q - P Q - - Q R

ఎ) QPRPR బి) QPRRP

సి) QRPQP డి) ఏదీకాదు

పై ఉదాహరణలో అక్షరాలు, ఖాళీలు మొత్తం 12 ఉన్నాయి. 12 ఉంటే 3 లేదా 4 స్థానాలను ఒక సమూహంగా విభజించాలని తెలియపరచడం జరిగింది గమనించండి.

ముందుగా తక్కువ స్థానాలుగా అంటే 3 స్థానాలుగా విభజించాలి. సరిచూసిన తదుపరి కచ్చితమైన సమాధానం రావడానికి అవకాశం లేనప్పుడు ఎక్కువ స్థానాలుగా అంటే 4 స్థానాలుగా విభజించుకోవాలి.

మొదట మూడేసి అక్షరాలను ఒక్కొక్క సమూహంగా విభజిస్తే P - R / - Q - / PQ - / - QR.

విభజించిన తరవాత గమనించిన మొదటి, మూడో సమూహంలో మొదటి అక్షరం P ఉన్నది. అందువల్ల రెండు, నాలుగు సమూహంలో మొదటి అక్షరం 'P' అవుతుంది. ఇప్పుడు రెండు, నాలుగు సమూహాల్లో మొదటి అక్షరంగా 'P' ఉంచినప్పుడు పై అక్షర క్రమం (లెటర్) కింది విధంగా ఏర్పడుతుంది.

P - R / PQ - / PQ - / PQR

ఇప్పుడు మళ్లీ గమనిస్తే రెండు, మూడు, నాలుగు సమూహాల్లో రెండో అక్షరంగా 'Q' ఉన్నది. కాబట్టి మొదటి సమూహంలో కూడా రెండో అక్షరం 'Q' అవుతుంది. ఇప్పుడు మొదటి సమూహంలో 'Q'ను ఉంచితే పై అక్షర క్రమం(లెటర్ సిరీస్) కింది విధంగా ఏర్పడుతుంది.

PQR /PQ - / PQ - / PQR

ఇప్పుడు మళ్లీ గమనిస్తే మొదటి, నాలుగు అక్షర సమూహంలో మూడో అక్షరంగా R ఉన్నది. అందువల్ల రెండు, మూడో సమూహంలో కూడా మూడో అక్షరం R అవుతుంది. ఇప్పుడు రెండు, మూడో సమూహంలో మూడో అక్షరంగా R ఉంచితే పై అక్షర క్రమం (లెటర్ సిరీస్) కింది విధంగా ఏర్పడుతుంది.

PQR / PQR / PQR /PQR

ఇప్పుడు అక్షర క్రమం పూర్తి అయింది. పైన ఖాళీలలో గల అక్షరాలు QPRRP ఇది సమాధానం అవుతుంది. ఆప్షన్స్‌లో QPRRP అనేది (బి)లో ఉన్నది. సమాధానం (బి) అవుతుంది.

మిగిలిన 6 నుంచి 18 వరకు ఉన్న పద్ధతుల్లో ఇచ్చికాల్లో ఇచ్చిన అక్షరాలను ఖాళీల్లో పెట్టుకొని జాగ్రత్తగా పరిశీలించి సమాధానాన్ని కనుగొనాలి. కాబట్టి ఇచ్చిన వివిధ రకాలైన సిరీస్ పద్ధతులను వీలైనన్ని ఎక్కువసార్లు గమనించి దాని కింద ఇచ్చిన వివరణల ఆధారంగా అవి ఏర్పడే విధానాలను అవగాహన చేసుకొని ఈ చాప్టర్‌లోని ప్రశ్నలకు సమర్థవంతంగా సమాధానాలు గుర్తించండి.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

దిక్సూచి
DIKSUCHI

గ్రూప్-1 మెయిన్స్ ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ



ఇండియా వర్సెస్ భారత్
ఒక దేశం రెండు పేర్లు

భారత్ అనే పేరును రాజ్యాంగంలో చేర్చాలని 1949 సెప్టెంబరు 18న నిర్వహించిన రాజ్యాంగ పరిషత్ సమావేశంలో కొందరు సభ్యులు కోరారు. 74 సంవత్సరాలు గడిచిన తరవాత కూడా ఆ చర్చ కొనసాగుతూనే ఉంది. 2023లో భారతదేశంలో కీలకమైన జీ-20 శిఖరాగ్ర సమావేశాల ప్రారంభ సన్నాహాల సందర్భంగా జరిగిన సంఘటనలు/ చర్చలతో ఈ డిమాండ్ మళ్లీ తెరపైకి వచ్చింది.

అయితే ఈసారి చర్చను పరిష్కరించే అంబేద్కర్ లేరు. 2023 సెప్టెంబరులో జీ-20 సమావేశాల సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీ-20 అతిథులకు పంపిన అధికారిక విందు ఆహ్వానంలో 'ద ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా'కు బదులు 'ద ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' అని ముద్రించారు. సమావేశాలు నిర్వహించిన ప్రదేశానికి 'భారత మండపం' అని పేరు పెట్టారు. సమావేశాల్లో ప్రధాని ముందున్న నేమ్‌ప్లేట్‌పై భారత్ అని పేర్కొన్నారు. దీంతో 2023 సెప్టెంబరు 18న ప్రారంభమైన పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ఇండియా పేరును భారత్‌గా అధికారికంగా రాజ్యాంగ సవరణ ద్వారా మార్చగలరనే ఊహాగానాలకు దారితీసింది. దీంతో ఒక్కసారిగా ఇండియా/భారత్ అనే పదాలపై ఒకింత ఆసక్తికరమైన చర్చ ప్రజాబాహుళ్యంలోకి వచ్చింది.

గతంలో ఈ అంశంపై మూడు సార్లు సుప్రీంకోర్టులో కేసులు దాఖలైనప్పటికీ, రాజ్యాంగ పరిషత్‌లో తప్ప మళ్లీ ఇంత పెద్ద ఎత్తున ప్రజాబాహుళ్యంలో ఎప్పుడూ చర్చకు రాలేదు. అయితే అందరూ ఊహించినట్లుగా పార్లమెంటులో ఈ అంశంపై ఎలాంటి తీర్మానం ప్రవేశపెట్టకపోవడం గమనార్హం. ఈ సందర్భంగా ఈ అంశంపై రాజ్యాంగ పరిషత్‌లో జరిగిన చర్చల నుంచి నేటివరకు జరిగిన పరిణామాలను ఒకసారి పరిశీలిద్దాం.

రాజ్యాంగ పరిషత్ 1946 డిసెంబరు 9న మొట్టమొదటిసారిగా సమావేశమైనప్పటికీ 1949 సెప్టెంబరు 18 వరకు దేశానికి ఒక 'పేరు'ను ఖరారు చేయలేకపోయింది. దేశానికి పేరుపెట్టే అంశాన్ని కేంద్ర (యూనియన్) రాజ్యాంగ కమిటీకి ఇచ్చింది. ఈ కమిటీ 1947 జూలై 4న జారీ చేసిన నివేదిక ప్రకారం 'ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' పేరును నిర్ణయించారు.

రాజ్యాంగ రచన విధానం

రాజ్యాంగాన్ని రూపొందించడం చాలా క్లిష్టమైన పని. సంక్షిప్తంగా చెప్పాలంటే రాజ్యాంగ పరిషత్ సభ్యులు ముందుగా రాజ్యాంగంలో ఏయే నిబంధనలను రూపొందించాలనే విషయాలను పరిశీలించి నివేదించడానికి అనేక కమిటీలను ఏర్పాటు చేశారు. తదనంతరం ఈ కమిటీలు తమ నివేదికలను సమర్పించాయి. వీటి ఆధారంగా వివిధ నిబంధనలను రూపొందించారు. వీటిని ఉపయోగించి రాజ్యాంగ సలహాదారు సర్ బి.ఎన్.రావు రాజ్యాంగ ముసాయిదాను సిద్ధం చేశారు. ఆ తరవాత ముసాయిదాను డ్రాఫ్టింగ్ కమిటీకి పంపారు. అది దానిపై చర్చించి అవసరమైన మార్పులు, చేర్పులను చేసింది. సవరించిన ముసాయిదాను అసెంబ్లీ, ప్రొవిన్షియల్ లెజిస్లేచర్లు, ప్రొవిన్షియల్ ప్రభుత్వాలు, మంత్రిత్వశాఖలు, ఫెడరల్ కోర్టు, హైకోర్టు సభ్యులకు పంపడంతోపాటు ప్రజల నుంచి విన్నపాలు స్వీకరించడానికి అందుబాటులో ఉంచారు. వారు తమ సూచనలను సమర్పించారు. ఆ తరవాత ముసాయిదా కమిటీ చైర్మన్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ దీనిని రాజ్యాంగ పరిషత్ అధ్యక్షునికి సమర్పించారు. ముసాయిదా రాజ్యాంగంపై సుదీర్ఘంగా చర్చించి, దానికి మార్పులు, చేర్పులు చేశారు. ఈ సవరణల ఫలితంగా భారత రాజ్యాంగం రూపుదిద్దుకుంది.

'భారత రాజ్యాంగంలో రాష్ట్రాల యూనియన్' అనే భావన కెనడియన్(బ్రిటిష్ నార్త్-అమెరికన్) చట్టం నుంచి స్వీకరించారు. బలమైన కేంద్రంతో కూడిన సమాఖ్యను ఏర్పర్చడానికి రాజ్యాంగంలో 'రాష్ట్రాల యూనియన్' అనే పదాలను పొందుపరిచారు.

రాజ్యాంగ పరిషత్ 1946 డిసెంబరు 9న మొట్టమొదటిసారిగా సమావేశమైనప్పటికీ 1949 సెప్టెంబరు 18 వరకు దేశానికి ఒక 'పేరు'ను ఖరారు చేయలేకపోయింది. దేశానికి పేరుపెట్టే అంశాన్ని కేంద్ర(యూనియన్) రాజ్యాంగ కమిటీకి ఇచ్చింది. ఈ కమిటీ 1947 జూలై 4న జారీ చేసిన నివేదిక ప్రకారం 'ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' పేరును నిర్ణయించారు.

'భారత రాజ్యాంగంలో రాష్ట్రాల యూనియన్' అనే భావన కెనడియన్(బ్రిటిష్ నార్త్-అమెరికన్) చట్టం నుంచి స్వీకరించారు. బలమైన కేంద్రంతో కూడిన సమాఖ్యను ఏర్పర్చడానికి రాజ్యాంగంలో 'రాష్ట్రాల యూనియన్' అనే పదాలను పొందుపరిచారు.

భరత్‌వర్ష్ అని పేర్కొనాలి

ఆర్టికల్-1(1) కింద ఈ రాజ్యాంగం ప్రారంభమైన తేదీ నుంచి ఇండియా ఒక సమాఖ్యగా ఉంటుందని సలహాదారు సర్ బి.ఎన్.రావు పేర్కొన్నారు. అయితే బి.ఎన్.రావు ముసాయిదా పంపిణీ చేసినప్పుడు ఈ రాజ్యాంగం ప్రారంభం నుంచి భారతదేశం రాష్ట్రాల యూనియన్‌గా ఉంటుందన్న వివరణను చేర్చాలని కేంద్ర రాజ్యాంగ కమిటీ సిఫార్సు చేసింది. ఈ సిఫార్సును చివరికి ముసాయిదా కమిటీ రూపొందించిన రాజ్యాంగ ముసాయిదాలో చేర్చారు. ఈ ముసాయిదాను సభ్యులకు సర్క్యులేట్ చేసినప్పుడు ఉపేంద్రనాథ్ బర్మన్ ఇండియాకు బదులుగా 'భరత్‌వవర్ష్' అనే పదాన్ని డ్రాఫ్ట్ అంతటా ఉపయోగించాలని కోరారు. ఈ సూచనను ముసాయిదా కమిటీ తిరస్కరించింది. కారణం ఇండియా అనే పదం ప్రస్తుతం ఒకటిన్నర శతాబ్దాలకు పైగా వాడుకలో ఉండటమే కాకుండా అంతర్జాతీయంగా కూడా ప్రసిద్ధి చెందింది. కాబట్టి ముసాయిదా అంతటా దానిని భరత్ వర్ష్‌గా మార్చడం మంచిది కాదని రాజ్యాంగ పరిషత్‌కు సమర్పించిన చివరి ముసాయిదాలో ఇండియా అనే పదాన్ని ఉపయోగించారు.

ఆర్టికల్-1 : ఇండియా అది భారత్: ఆర్టికల్-1పై రాజ్యాంగ పరిషత్‌లో సుదీర్ఘంగా చర్చ జరిగింది. శిబ్బన్‌లాల్ సక్సేనా ఇండియాను భరత్‌వర్ష్ అని సంబోధించేలా అనేక సవరణలను ప్రవేశపెట్టారు. ఉదాహరణకు 1948 నవంబరు 15న 'యూనియన్ పేరు భారత్' అని ఒక సవరణను ప్రవేశపెట్టారు. అలాగే రాజ్యాంగ అధికారులను కాన్‌స్టిట్యూషనల్ ఆఫీసర్స్ ఆఫ్ ఇండియాగా కాకుండా, కాన్‌స్టిట్యూషనల్ ఆఫీసర్స్ ఆఫ్ భారత్‌గా సంబోధించాలని కోరారు. అదేవిధంగా చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాను చీఫ్ జస్టిస్ ఆఫ్ భారత్‌గా సంబోధించాలని సవరణలను ప్రవేశపెట్టారు. అయితే ఆయన ప్రవేశపెట్టిన సవరణ తీర్మానాలన్నింటినీ రాజ్యాంగ పరిషత్ తిరస్కరించింది.

● 1949 సెప్టెంబరు 17న రాజ్యాంగ పరిషత్ సభా సమావేశం ముగియడానికి అరగంట మాత్రమే మిగిలి ఉంది. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఇండియా అనే పేరును తాను ఇష్టపడతానని స్థిరంగా పేర్కొన్నాడు. చరిత్ర అంతటా, గత సంవత్సరాల్లో భారతదేశాన్ని ఇండియాగా పిలిచేవారు. 'యుఎన్'లో సభ్యునిగా మన దేశం పేరు ఇండియా అని అనేక అంతర్జాతీయ ఒప్పందాలపై ఇండియా అనే పేరుతోనే సంతకం చేసిందని పేర్కొన్నాడు. అయితే ఆశ్చర్యకరంగా 1949 సెప్టెంబరు 17న ఆర్టికల్ '1'ని సవరిస్తూ 'ఇండియా అది భారత్' అని సవరణను ప్రవేశపెట్టారు. ఈ మార్పుపై డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఎలాంటి వివరణను ఇవ్వలేదు.



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్



నవ్యాంధ్ర టూవీలర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత సేవా శిబిరం



విజయవాడలోని వరద ప్రభావిత రాజీవ్‌నగర్‌లో తాగునీటి సరఫరా



వైఎస్సార్ కాలనీలో ఇంటిని శుభ్రం చేసుకుంటున్న దృశ్యం

సీఎం కార్యక్రమంలో భద్రతా లోపం

» సిద్దరామయ్య పాల్గొన్న వేదిక పైకి దూసుకెళ్లిన యువకుడు

» విధానసౌధ ప్రాంగణంలో ఘటన





వేదికపై సీఎం పక్కన పడిన కండువా, యువకుడిని అదుపులోకి తీసుకుంటున్న భద్రతా సిబ్బంది

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య పాల్గొన్న సభావేదిక పైకి ఓ యువకుడు దూసుకెళ్లడం కలకలం రేపింది. ఆదివారం అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక విధానసౌధ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్ప మాట్లాడుతుండగా.. ఓ యువకుడు ఒక్కసారిగా వేదిక పైకి దూసుకువచ్చాడు. కన్నడ కండువా వేసుకున్న ఆ యువకుడు ఓ శాలువాను సీఎంపైకి విసరగా, ఆయన పక్కన ఉన్న వారిపై పడింది. ఆ యువకుడిని బెంగళూరులోని కనకపురకు చెందిన మహదేవ నాయక్‌గా గుర్తించి, కేసు నమోదు చేశారు. అతను పలు ప్రశ్నలు వేస్తూ నినాదాలు చేశాడు. ఆ యువకుడు ఏం చెప్పదలచుకున్నాడనే విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సీఎం పాల్గొన్న సభలో భద్రతా వైఫల్యంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలోనూ సీఎం సిద్దరామయ్య పాల్గొన్న రోడ్‌షోలో తుపాకి కలిగిన వ్యక్తి కనిపించడం చర్చకు దారితీసింది. బెంగళూరులో ఇటీవలే రామేశ్వరం కెఫేలో బాంబు పేలుడు జరిగిన విషయం తెలిసిందే. ఆ తర్వాత విధానసౌధ ప్రాంగణంలో పాకిస్థాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేయడం సంచలనమైంది. ఇలా తరచూ భద్రతా వైఫల్యాలు వెలుగులోకి వస్తుండడంతో సర్వత్రా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

పరప్పన జైలుపై సీసీబీ దాడి

» 18 మొబైల్ ఫోన్లు, డ్రగ్స్, నగదు స్వాధీనం

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పరప్పన అగ్రహార సెంట్రల్ జైలుపై సీసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. విల్సన్ గార్డెన్ నాగతో పాటు అతని సహచరుల నుంచి 18 మొబైల్ ఫోన్లు, డ్రగ్స్, నగదు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. సీసీబీ అధికారులు శనివారం దాడి చేసినట్లు ప్రకటించారు. నగర పోలీస్ కమిషనర్ దయానంద్ సూచన మేరకు దాడి జరిగినట్లు తెలుస్తోంది. ఆగస్టు 24న సీసీబీ అధికారులు పరప్పన జైలుపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఆ మరుసటి రోజే దర్శన్ జైలులో కాఫీ సేవిస్తూ, సిగరెట్ తాగుతూ నలుగురితో కలిసి కుర్చీలో కూర్చున్న ఫొటో వైరల్ అయింది. ఇలా తరచూ జైలుపై దాడులు చేస్తూ అక్రమాలను నివారించవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే దాడులు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

ఎమ్మెల్యే మునిరత్నకు రెండు రోజుల పోలీస్ కస్టడీ

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించారని, కంట్రాక్టర్ నుంచి లంచం డిమాండ్ చేశారనే ఆరోపణలతో బెంగళూరు రాజరాజేశ్వరినగర్ బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నకు రెండు రోజుల పోలీస్ కస్టడీ విధించారు. శనివారం సాయంత్రం కోలారు జిల్లా ముళబాగిలు సమీపాన ఆయన్ను అదుపులోకి తీసుకున్న పోలీసులు రాత్రి బెంగళూరుకు తీసుకొచ్చారు. ఆదివారం వైద్య పరీక్షలు నిర్వహించి, న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. వారం రోజుల కస్టడీకి పోలీసులు కోరగా.. న్యాయమూర్తి రెండు రోజులకు అనుమతించారు. కాగా మునిరత్నపై చర్యల వెనుక రాజకీయ వేధింపులు లేవని మంత్రి లక్ష్మి హెబ్బాళ్కర్ సహా పలువురు వ్యాఖ్యానించారు. మరోమంత్రి సతీశ్ జార్కిహొళి మాట్లాడుతూ.. కులదూషణలు చేయమని తామేమైనా సూచించామా అంటూ ప్రశ్నించారు. ప్రతిపక్షనేత అశోక్ బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ.. హోం మంత్రి పరమేశ్వర్ కుట్రపన్ని మునిరత్నను అరెస్టు చేయించారని మండిపడ్డారు.

పాలస్తీనా జెండాతో యువకుల హల్‌చల్

తుమకూరు జిల్లా కుణిగల్‌లో పాలస్తీనా జెండా ఆవిష్కరించేందుకు గత నెల 15న ప్రయత్నించిన ఘటన మరువకముందే చిక్కమగళూరులో పాలస్తీనా జెండాతో ద్విచక్రవాహనంపై ముగ్గురు యువకులు హల్‌చల్ చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. ఆదివారం చిక్కమగళూరు నగరంలోని ప్రధాన వీధుల్లో ఒకే వాహనంపై ముగ్గురు యువకులు పాలస్తీనా జెండాతో చక్కర్లు కొట్టారు. ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్ కావడంతో హిందూ కార్యకర్తలు చిక్కమగళూరు నగర పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు.



అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం రాచపల్లి కూడలి వద్ద ఏలేరు కాలువ గండి పూడ్చివేత పనులు

ఏలేరు కాలువకు గండి

» వెంటనే స్పందించిన జీవీఎంసీ అధికారులు.. గండి పూడ్చివేత

మాకవరపాలెం (అనకాపల్లి జిల్లా), సెప్టెంబరు 15: కాకినాడ జిల్లా ఏలేరు రిజర్వాయర్ నుంచి విశాఖ నగరానికి తాగునీరు సరఫరా చేసే కాలువకు గండి పడింది. అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం రాచపల్లి కూడలికి సమీపంలో 99.6 కిలోమీటరు వద్ద ఆదివారం ఉదయం సుమారు పది మీటర్ల వెడల్పున భారీ గండిపడింది. అయితే పక్కనే జాగారాల గెడ్డ ఉండడంతో, నీరంతా దానిలోకి ప్రవహించడంతో పంట పొలాలు ముంపుబారిన పడలేదు. సమాచారం అందుకున్న మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) అధికారులు వెంటనే స్పందించారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఎక్స్‌కవేటర్లను రప్పించి ఇసుక బస్తాలు, సరుగుడు కర్రలతో గండి పూడ్చివేత పనులు చేపట్టారు. కాగా, ఈ ప్రదేశంలో గతంలో కూడా పలుమార్లు గండ్లు పడినట్టు స్థానికులు చెబుతున్నారు. మాకవరపాలెం మండలంలో పలుచోట్ల ఏలేరు కాలువ గట్లు బలహీనంగా ఉన్నాయని, గండ్లు పడే ప్రమాదం ఉన్నందున వీటిని పటిష్ఠం చేయాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

అమెరికా ఎన్నికల ర్యాలీలో డీకే శివకుమార్

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమెరికా ఎన్నికల ర్యాలీలో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పాల్గొన్నారు. యూఎస్ పర్యటనలో ఉన్న ఆయన శనివారం ఎన్నికల ర్యాలీని వీక్షించే అద్భుత అవకాశం లభించిందని 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఇక్కడ ఎన్నికల ర్యాలీని చూసినపుడు ఎంతో నేర్చుకోవాలని అనిపించిందని పేర్కొన్నారు. ప్రజాశక్తి, ఉత్సాహం స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. ఈ మహత్తరమైన కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా మరిన్ని విషయాలు నేర్చుకోవాలని ఎదురు చూస్తున్నానని తెలిపారు. డీకే శివకుమార్ ఈ నెల 8న అమెరికా పర్యటనకు వెళ్లారు.

మిత్రులతో గడపాలని భర్త వేధింపులు

» ససేమిరా అన్నందుకు దారుణహత్య

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తన మిత్రులతో గడపాలని, అంతవరకు తాకేది లేదని భార్యను వేధించినా ఆమె ససేమిరా అనడంతో దారుణంగా హత్యచేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యాదగిరి జిల్లా శెహపుర తాలూకా గంగనాళ గ్రామానికి చెందిన శరణ బసమ్మ (25) జూలైలో హత్యకు గురికాగా.. పోలీసులు ఈ కేసును తాజాగా ఛేదించారు. శరణబసమ్మకు హుణసగి గ్రామక్యాంపులో నివసించే భీమణ్ణ (32)తో 14 నెలల క్రితం వివాహమైంది. మూడు నెలలపాటు అన్యోన్యంగా గడిపారు. ఆ తర్వాత 'నిన్ను తాకాలంటే నా మిత్రులతో గడపాలి' అని ఆమెను భీమణ్ణ వేధించేవాడు. జూలైలో భార్యతో పాటు ఆమె పుట్టినిల్లు గంగనాళ గ్రామానికి వెళ్లిన భీమణ్ణ తలగడతో ఊపిరి ఆడకుండా చేసి శరణ బసమ్మను హత్యచేశాడు. స్పృహ కోల్పోయిందంటూ బంధువులతో కలిసి ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లగా.. మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. కాగా ఆమె మృతి అసహజంగా ఉందని వైద్యులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆమె మృతికి సంబంధించి ఫోరెన్సిక్ నివేదిక ఇటీవల రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సొంతూరిలో హత్యచేస్తే పట్టుబడతానని, పుట్టింటిలోనే భార్యను చంపి ఆ తర్వాత ఏమీ తెలియనివాడిలా నటించాడు. చివరకు ఫోరెన్సిక్ నివేదికలో గొంతు నులమడంతో ఊపిరి ఆగినట్టు తేలడంతో భీమణ్ణను పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించడంతో హత్య చేసినట్టు అంగీకరించాడు. ఈ మేరకు గోగి పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేశారు.

3 ఏళ్లు.. 5 వేల వీసాలు.. రూ. 300 కోట్లు

» ఢిల్లీలో నకిలీ వీసా రాకెట్ గుట్టు రట్టు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: దేశ రాజధాని ఢిల్లీలో పోలీసులు నకిలీ వీసాలు సృష్టిస్తున్న ముఠా ఆటలను కట్టించారు. హరియాణాకు చెందిన సందీప్ అనే వ్యక్తి స్వీడన్ వెళ్లేందుకు ఆదివారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఎయిర్‌పోర్టుకు వచ్చాడు. ఇమ్మిగ్రేషన్ చెక్‌లో సందీప్ వద్ద ఉంది నకిలీ వీసా అని అధికారులు గుర్తించి అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా తన ప్రాంతం నుంచి చాలా మంది ఇలాగే నకిలీ వీసాలతో విదేశాలకు వెళ్లినట్లు చెప్పాడు. తాను ఆసిఫ్ అలీ అనే ఏజెంట్‌కు రూ. 10లక్షలిచ్చి ఈ నకిలీ వీసాను పొందినట్లు చెప్పాడు. పోలీసులు ఆసిఫ్ అలీని అరెస్టు చేసి విచారించగా అతడు మరో ఇద్దరి పేర్లు చెప్పాడు. ఇలా మొత్తం ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా.. గ్రాఫిక్ డిజైనింగ్ వచ్చిన మనోజ్ మోంగా అనే వ్యక్తి ఈ ముఠాలో కీలక పాత్రను పోషిస్తున్నట్లు తెలుసుకున్నారు. అతను ఢిల్లీలోని తిలక్‌నగర్‌లో ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని అందులో యంత్రాలు పెట్టి వాటి ద్వారా నకిలీ వీసాలను రూపొందిస్తున్నట్లు పోలీసులు చెప్పారు. అతడు మూడేళ్లలో 5 వేలకు పైగా నకిలీ వీసాలు రూపొందించాడని, దానికి గాను రూ. 300 కోట్లు ఆర్జించాడని పోలీసులు తెలిపారు. ఒక నెలలో అతడు 30 నుంచి 60 నకిలీ వీసాలను తయారు చేస్తాడని, ఒక్కో వీసాను రూ. 8 నుంచి 10 లక్షలకు విక్రయిస్తాడని చెప్పారు. జైదీప్ సింగ్ అనే వ్యక్తి మనోజ్‌కు ఈ పని నేర్పించి యంత్రాలు సరఫరా చేసినట్లు తెలుసుకుని అతడిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

నాగార్జున కొండపై పర్యాటకుల సందడి



నాగార్జున కొండను సందర్శించేందుకు వెళ్తున్న పర్యాటకులు

మాచర్ల రూరల్, సెప్టెంబరు 15: ఆదివారం సెలవు కావడంతో ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండను పర్యాటకులు భారీగా సందర్శించారు. మండలంలోని విజయపురిసౌత్ లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు వివిధ లాంచీలలో వెళ్లిన పర్యాటకులు కొండపై గల మ్యూజియంలోని బుద్ధుని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టి కుండలు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్థూపం, బోధి వృక్షంను సందర్శించారు. అనంతరం పచ్చని కొండల మధ్య ఉన్న అనుపు, యాంపి థియేటర్, అశ్వమేధ యజ్ఞశాల, శ్రీరంగనాథస్వామి దేవాలయంను వీక్షించారు. అలాగే 60 అడుగుల ఎత్తు నుంచి జాలువారుతున్న ఎత్తిపోతల జలపాతం అందాలను తిలకించారు. పర్యాటకులు భారీగా రావడంలో లాంచీల ద్వారా రూ. 61,750 ఆదాయం సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

ముగిసిన విద్యా భారతి క్షేత్రస్థాయి క్రీడా పోటీలు



విజేతలను అభినందిస్తున్న ధనప్రకాశ్, విద్యా భారతి ప్రతినిధులు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 15: విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర ఆధ్వర్యంలో మంగళగిరి మండలం నూతక్కి గ్రామంలోని విజ్ఞాన విహార పాఠశాలలో రెండు రోజులపాటు జరిగిన క్రీడా పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ముగింపు ఉత్సవానికి మోడల్ డెయిరీ వ్యవస్థాపకులు పిన్నమనేని ధనప్రకాశ్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా భారతి విద్యాలయాల్లో క్రీడలకు ఇస్తున్న ప్రాధాన్యం అభినందనీయమన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి భారతదేశం తరఫున ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. రెండు రోజుల క్షేత్రస్థాయి పోటీల్లో విద్యా భారతి కర్ణాటక ఛాంపియన్‌గా నిలువగా, విద్యా భారతి ఏపీ ద్వితీయ, శ్రీసరస్వతీ విద్యా పీఠం (తెలంగాణ) తృతీయ స్థానాల్లో నిలిచాయి. కార్యక్రమంలో విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి, ఖేల్ కూద్ సంయోజక్ కేఆర్‌కే సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కన్నా భాస్కర్, సీటీఆర్ ప్రసాద్, విజ్ఞాన విహార వైస్ ప్రెసిడెంట్ వెలగపూడి రామకృష్ణ, క్షేత్ర సహ కార్యదర్శి వి.వినోద్‌కుమార్, ప్రిన్సిపాల్ వి.సురేశ్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీరామమూర్తి, అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎద్దుల బండలాగుడు జాతీయ స్థాయి పోటీలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 15: నందమూరి తారక రామారావు మెమోరియల్, నూతలపాటి పరమేశ్వరరావు మెమోరియల్ ఎద్దుల బండలాగుడు జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రత్తిపాడు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్ తెలిపారు. మండల తెలుగుదేశం పార్టీ, తెలుగు యువత ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభం అయ్యే ఈ పోటీలు సీనియర్స్ జూనియర్స్, సబ్ జూనియర్స్, కేటగిరి విభాగము, ఆరు పళ్ల లోపు, నాలుగు పళ్ల లోపు, 2 పళ్ల లోపు, పాల పళ్ల విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అన్ని విభాగాల్లో మొదటి 8 జతలకు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఈ పోటీలను ప్రారంభిస్తారని అన్నారు.

ఆకాశహర్మ్యాలకు 30 మీటర్ల దూరం తప్పనిసరి

- 2015లో రైల్వే బోర్డు సర్క్యులర్
- దీనిని పాటించకుండా వైసీపీ నేత అపార్టుమెంట్ల నిర్మాణం
- ఎమ్మెల్యే నరేంద్ర వ్యాఖ్యలు రైల్వేలో చర్చనీయాంశం

గుంటూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరం నడిబొడ్డున స్వామి థియేటర్ సమీపంలో వైసీపీ నేత అంబటి మురళీకృష్ణ గత కొన్నేళ్లుగా నిర్మిస్తున్న గ్రీన్ గ్రేస్ ఆకాశహర్మ్యాల విషయంలో రైల్వే జారీ చేసిన ఎన్‌వోసీ (నిరభ్యంతర పత్రం)ని ఉల్లంఘించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ శనివారం ఈ అంశాన్ని బహిర్గతం చేయడంతో రైల్వేలో చర్చనీయాంశంగా మారింది. దీనికి సంబంధించి రైల్వే శాఖ ఏ నిబంధనలు విధించి ఎన్‌వోసీ జారీ చేసిందనే దానిపై అధికారులు శోధిస్తున్నారు. ఎన్‌వోసీ డివిజన్ స్థాయిలోనే ఇచ్చారా.. జోన్ నుంచి వచ్చిందా అనే వివరాలు కూడా సేకరిస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో రెండు రైలు మార్గాలు మాత్రమే ఉన్నాయి. అయితే రాబోయే రోజుల్లో నల్లపాడు నుంచి కృష్ణాకెనాల్ జంక్షన్ వరకు 3, 4 రైలు మార్గాల నిర్మాణాలను రైల్వే మంజూరు చేసింది. దీని దృష్ట్యా రైల్వేహద్దు నుంచి వైసీపీ నేత నిర్మిస్తున్న ఆకాశహర్మ్యాలు ఎంత దూరంలో ఉన్నాయనే దానిని అధికారులు సర్వే చేసి హెడ్‌క్వార్టర్స్‌కు రిపోర్టు చేసే అవకాశం ఉంది.

2015 కొత్త సర్క్యులర్ ప్రకారం..

రైల్వే స్థలానికి సమీపంలో ఎలాంటి కట్టడం నిర్మిస్తున్నా అందుకు ఆ శాఖ నుంచి నిరభ్యంతర పత్రం తప్పనిసరిగా తీసుకోవాలి. 2015కు ముందు వరకు 1995లో రైల్వేబోర్డు జారీ చేసిన సర్క్యులర్ ఆధారంగా జోన్ చీఫ్ ఇంజినీరు ఈ ఎన్‌వోసీని జారీ చేసేవారు. అప్పట్లో స్థానిక సంస్థలు అనుమతించిన బిల్డింగ్ ప్లాన్ ఎత్తులో కనీసం 50 శాతం రైల్వేసరిహద్దు నుంచి స్థలం విడిచిపెట్టి నిర్మించుకోవాలి. ఉదాహరణకు బిల్డింగ్ ఎత్తు 100 అడుగులు అయితే రైల్వే స్థలం నుంచి 50 అడుగుల స్థలం వదలాలి. అయితే 2015లో రైల్వేబోర్డు కొత్త సర్క్యులర్‌ని తీసుకొచ్చింది. కనీసం 30 మీటర్లు(98.4252 అడుగుల) దూరం స్థలాన్ని విడిచి పెట్టి భవనాలను నిర్మించుకోవచ్చు. అయితే ఇందుకు కూడా చీఫ్ ఇంజనీర్ నుంచి ఎన్‌వోసీ తీసుకోవాలి.

తనిఖీకి అధికారులు సన్నద్ధం

వైసీపీ నేత తొలుత రెండు సెల్లార్లు, ఐదు అంతస్తుల వరకే ప్లాన్ తీసుకొన్నట్లు ఎమ్మెల్యే నరేంద్ర పత్రాలను బహిర్గతం చేశారు. 1995 సర్క్యులర్ ప్రకారం రైల్వే నుంచి ఎన్‌వోసీ తీసుకొన్నట్లు స్పష్టం అవుతుంది. అయితే 2015 జూన్‌లో కొత్త సర్క్యులర్ అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం అయితే ప్రస్తుతం క్షేత్రస్థాయిలో అంత స్థలం విడిచి పెట్టలేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎమ్మెల్యే నరేంద్ర తాజా ఆరోపణల నేపథ్యంలో రైల్వే అధికారులు తనిఖీకి సన్నద్ధమౌతున్నారు. దీనిపై హెడ్‌క్వార్టర్స్ చీఫ్ ఇంజనీర్‌కు నివేదించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

అంబటి సోదరుల అవినీతిపై విచారణ జరపాలి



సమావేశంలో మాట్లాడుతున్న కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆయన సోదరుడు మురళీకృష్ణ, అల్లుడు ఎండూరి రూపేశ్ అవినీతి, అరాచకాలపై ప్రభుత్వం వెంటనే ఏసీబీ విచారణకు ఆదేశించాలని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల పేరుతో తక్కువ ధరలకు భూమికొని, ఎక్కువ ధరకు ప్రభుత్వానికి అమ్మి సొమ్ము చేసుకున్న అవినీతి సామ్రాట్ అంబటి అని ఆరోపించారు. రేషన్ బియ్యం, పేకాట, కోడిపందేలు, లాటరీలు, చెరువుల్లో పూడిక తీయటం, జగనన్న ఇళ్ల నేలచదును చేయటం, విద్యుత్ సబ్ స్టేషన్లలో షిఫ్ట్ ఆపరేటర్ల పోస్టుల భర్తీలో, కోల్డ్‌స్టోరేజిలు కట్టుకున్నందుకు డబ్బులు తీసుకోవటం వంటి వాటిల్లో అంబటి సోదరుల అవినీతిని నిరూపించటానికి తాను సిద్ధంగా ఉన్నానని కనపర్తి సవాల్ చేశారు. అంబటి సోదరుల అవినీతికి బ్రోకర్లుగా కళ్లం విజయ భాస్కరరెడ్డి, రాయపాటి పురుషోత్తం, కుక్కట్ల శ్రీనివాసరావు వ్యవహరించారని, వీరిని విచారిస్తే అసలు వాస్తవాలు బయటకు వస్తాయని చెప్పారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో ల్యాండ్ కన్వర్షన్‌తోపాటు ఇతర అనుమతులు కావాలంటే ఎకరాకు రూ.5 లక్షలు, ప్లాటు అమ్ముకుంటే రూ.10 లక్షలు కప్పం కట్టాలని అన్నారు. 4 ఎకరాల ప్రభుత్వ పోరంబోకు భూమిని ఆక్రమించారని, 2019 వరకు నియోజకవర్గంలో సెంటు స్థలం లేని అంబటి వైసీపీ అధికారంలోకి రాగానే 20 ఎకరాలకుపైగా కొనుగోలు చేయటమే కాకుండా పక్కనున్న అసైన్డ్ భూమిని కూడా ఆక్రమించి ఫామ్ హౌస్ నిర్మించారని ఆరోపించారు. అంబటి అల్లుడు రూపేశ్ నకరికల్లు మండలంలోని ఎర్రమట్టి, ముగ్గురాయి, మైనింగ్ తదితర సహజ వనరులను దోచుకున్నాడని, వారి అవినీతిపై సొంత పార్టీ నేతలే హైకోర్టుని ఆశ్రయించారని తెలిపారు. మురళీకృష్ణ అక్రమంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవన నిర్మాణాల అవినీతిపై టీడీపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర చేసిన సవాల్‌ను స్వీకరించే దమ్ము అంబటి సోదరులకు ఉందా అని ప్రశ్నించారు. అంబటి సోదరుల అవినీతిపై ప్రభుత్వానికి, ఏసీబీ చీఫ్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు కనపర్తి శ్రీనివాస్ తెలిపారు. కార్పొరేటర్ నూకవరపు బాలాజి, గోళ్ల ప్రభాకర్, యర్రగుంట్ల ఆనంద్ పాల్గొన్నారు.

దేశానికి అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ రెండు కళ్లు



అమృతలూరులో జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు, ఎంపీ కృష్ణప్రసాద్

అమృతలూరు, సెప్టెంబరు 15: దేశానికి, దళిత జాతికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ రెండు కళ్ల లాంటి వారని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఉత్తర ఎస్సీ కాలనీ పార్కులో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సుకుమార్ అధ్యక్షత వహించారు. సభలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ఆ మహనీయులు చేసిన త్యాగాలు, ఆశయాల వల్ల మనం ఈ స్థానంలో ఉన్నామని అన్నారు. వారు వేసిన బాటలో నడవడం వలన మన జీవితాలు బాగున్నాయని, మనం కూడా ఆ బాటలోనే నడిస్తే మన పిల్లల జీవితాలు కూడా బాగుంటాయన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం రూపకల్పన చేస్తే, సుదీర్ఘకాలం పార్లమెంటేరియన్‌గా ఉన్న జగ్జీవన్‌రామ్ రాజ్యాంగం అమలుకు కృషి చేశారని కొనియాడారు. రాజ్యాంగ రక్షకుడిగా నిలబడ్డ వ్యక్తి జగ్జీవన్‌రామ్ అన్నారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కుల వివక్ష అధికంగా ఉన్న నాటి రోజుల్లో ఎదురేగి పోరాడిన వ్యక్తి జగ్జీవన్‌రామ్ అన్నారు. వ్యవసాయ రంగంను కొత్త పుంతలు తొక్కించారని కొనియాడారు. నూతన విత్తన వంగడాల సృష్టికి రూపకల్పన చేసిన వ్యక్తి జగ్జీవన్‌రామ్ అన్నారు. బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్య వచ్చేలా చేసినది జగ్జీవన్‌రామ్ అని తెలిపారు. గ్రేస్ ఫౌండేషన్ అధ్యక్షుడు కైతేపల్లి షాలెంరాజు, కొత్తపల్లి రవీంద్రబాబు, శరణుగిరి, గొట్టిపాటి భాను గంగాధర్, సర్పంచి దేవరకొండ రాము, మట్లపూడి జయపాల్, ఏటుకూరి విజయమాదిగ, ఆనంద్‌మాదిగ, జిల్లా అబ్దుల్ కలాం ఫౌండేషన్ అధ్యక్షుడు పఠాన్ రాజేష్, పాస్టర్ విశ్వనాథం, అమర్తలూరి ప్రభాకరరావు, సీహెచ్ బాబు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

నలుగురు డీఎస్పీలకు పోస్టింగ్స్

గుంటూరు, సెప్టెంబరు 15: జిల్లాలో నలుగురు డీఎస్పీలకు పోస్టింగ్స్ ఇస్తూ డీజీపీ ద్వారకాతిరుమలరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా భారీగా డీఎస్పీలకు పోస్టింగ్స్ లభించాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పలువురు డీఎస్పీలను బదిలీ చేశారు. తాజాగా ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా 47 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ అందులో జిల్లాలో నలుగురికి పోస్టింగ్స్ ఇచ్చారు. ఈస్ట్ డీఎస్పీగా గుంతకల్లు డీఎస్ఆర్‌పీలో విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ అజీజ్‌ను నియమించారు. గతంలో ఆయన ఉమ్మడి గుంటూరు జిల్లాలో సీఐగా పలు పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వహించారు. ట్రాఫిక్ డీఎస్పీగా వెయిటింగ్‌లో ఉన్న ఎం.రమేష్‌ను నియమించారు. సత్తెనపల్లి డీఎస్పీగా డీజీపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మేదరమెట్ల హనుమంతరావును నియమించారు. హనుమంతరావు గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎస్సైగా, సీఐగా విధులు నిర్వహించారు. గుంటూరు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు డీఎస్పీగా పనిచేస్తున్న బి.సీతారామయ్యను నియమించారు. సీతారామయ్య గతంలో గుంటూరు జిల్లాలో ఎస్ఐగా. సీఐగా, డీఎస్పీగా విధులు నిర్వహించారు. గత ఎన్నికలకు ముందు ఆయన్ను కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు డీఎస్పీగా నియమించారు. సత్తెనపల్లి డీఎస్పీగా పని చేస్తున్న జి.గురునాథ బాబును డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు. జిల్లాలో తుళ్లూరు, గురజాల, సౌత్ సబ్ డివిజన్‌లకు డీఎస్పీలను నియమించాల్సి ఉంది.

ప్రకాశం బ్యారేజి దిగువకు 59,550 క్యూసెక్కులు



తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 15: ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 69,650 క్యూసెక్కుల వరద నీరు ఆదివారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరినట్లు నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 11.8 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 30 గేట్లను 2 అడుగుల మేర, 20 గేట్లను 1 అడుగు మేర ఎత్తి దిగువకు 59,550 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 10,130 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు జేఈ తెలిపారు.

పులిచింతలకు..

అచ్చంపేట, సెప్టెంబరు 15: పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 56,253 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 50,986 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. వీటిలో 16 వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా దిగువకు విడుదల అవుతున్నాయి.

వర్షాలకు దెబ్బతిన్న కూరగాయల పంటలు

- ఆందోళన చెందుతున్న రైతులు
- పంటలను రక్షించుకునేందుకు మందుల పిచికారి



కొల్లిపరలో డ్రోన్‌తో కందలో మందుల పిచికారి

కొల్లిపర, సెప్టెంబరు 15: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మెట్ట భూముల్లోని పంటలు వెలవెలపోతున్నాయి. వాతావరణంలో వచ్చిన మార్పుతోపాటు వర్షాల కారణంగా మెట్ట భూముల్లో వేసిన వాణిజ్య పంటలు దెబ్బతింటున్నాయి. పసుపు, కంద, అరటి పంటల్లో తేమ ఎక్కువగా ఉండటంతో ఆకుపచ్చగా ఉండాల్సిన ఆకులు తెల్లగా మారుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కూరగాయల పంటలైన వంగ, మిర్చి, బెండ, దొండ, దోస, బీర తోటలకు తెగుళ్లు వ్యాపించాయి. దీంతో రైతులు వాటిని రక్షించుకోవడానికి మందులను వివిధ రకాలుగా పిచికారి చేస్తున్నారు. కొన్నిచోట్ల డ్రోన్ సహాయంతో మందులను పిచికారి చేస్తున్నారు. కొంతమంది ఉద్యానవన శాఖాధికారుల సూచనలు, సలహాల మేరకు ఎరువులను చల్లుతున్నారు. వాణిజ్య పంటలకు తెగుళ్ల వ్యాపించడంతో అదనంగా ఖర్చులు అవుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. కూరగాయలకు మార్కెట్‌లో మంచి ధరలు ఉండటంతో డెల్టా ప్రాంతమైనా కొల్లిపర మండలంలో దావులూరు పాలెం, హనుమాన్‌పాలెం, అన్నవరం, అన్నవరంగౌడపాలెం, తూములూరు, మున్నంగి, వల్లభాపురం, పిడపర్రు, కొల్లిపర తదితర గ్రామాల్లోని రైతులు తక్కువ కాలంలో చేతికి వచ్చే వివిధ రకాల కూరగాయల పంటలను మెట్ట భూముల్లో సాగు చేశారు. పైర్లు బాగా కాపు, పిందె, పూత దశలో ఉన్న సమయంలో వర్షాలు పడటంతో రైతులు లక్షలాది రూపాయల ఆదాయాన్ని కోల్పోయారు. వర్షాల కారణంగా పూత రాలిపోవడంతోపాటు తెగుళ్ల సోకి పురుగు ఆశించింది. పైర్లలో నీరు నిలిచి పోవడంతో కాయలు కుళ్లిపోయాయి. దోస, సొర, బీర పైర్లు వేసిన కాయలు వర్షపు నీటిలో, బురదలో నిల్వ ఉండటంతో పంటలు దెబ్బతిని రైతులు ఆవేదన చెందుతున్నారు. బెండ, వంగతోటల్లో వర్షానికి నీరు నిలిచి తెగుళ్ల ఆశించటంతోపాటు పూత రాలిపోయినట్లు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం కూరగాయలకు ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఎకరానికి ఖర్చులు పోనూ రూ.90 వేల నుంచి లక్ష రూపాయల వరకు వచ్చే ఆదాయాన్ని కోల్పోయినట్లు రైతులు చెబుతున్నారు.



మిరప తోటకు మందులను పిచికారి చేస్తున్న రైతు

గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్ నిర్మాణంలో నాణ్యత లోపాలు

- ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్



గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్ సెల్లార్‌లో విరిగిపడ్డ మట్టి పెళ్లలు

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 15: గుంటూరు నగరంలో బజరంగ్ ప్రాంగణంలో జరుగుతున్న గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్ నిర్మాణంలో నాణ్యత లోపాలు ఉన్నాయని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. అపార్టుమెంట్ నిర్మాణం జరుగుతున్న ప్రాంగణంలో రిటైనింగ్ వాల్ నిర్మాణం సక్రమంగా జరగలేదన్నారు. అందుకే పక్కనున్న మట్టి పెళ్లలు విరిగి పడ్డాయని తెలిపారు. ఇలాంటి సంఘటనలు మరెన్నో ఉన్నాయని పేర్కొన్నారు. అయినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్పొరేషన్ అధికారులు ఎలాంటి పర్యవేక్షణ చేయడం లేదని విమర్శించారు. బిల్డింగులు కూలడం, కూలిన శిథిలాల కింద కార్లు ఉన్నప్పటికీ చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. భవిష్యత్తులో మరికొన్ని ఆధారాలతో అక్కడ జరుగుతున్న అక్రమాలను వెలుగులోకి తెస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతి

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు..

యడ్లపాడు, సెప్టెంబరు 15: యడ్లపాడు మండలం తిమ్మాపురం పరిధిలో పదహారో నంబరు జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు దుర్మరణం చెందిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా నిడమర్రు గ్రామానికి చెందిన ఈబుచర్ల రవికిషోర్(22), వడల కృష్ణ(31) హాల్టింగ్ డ్రైవర్లుగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నిడమర్రు గ్రామానికే చెందిన మోహన్ రొయ్య పిల్లల శాంపిల్స్ కోసం శనివారం వీరిని నెల్లూరుకు పంపించాడు. కారులో నెల్లూరు వెళ్లిన ఇద్దరు రొయ్య పిల్లల శాంపిల్స్ తీసుకుని తిరుగు ప్రయాణమైయ్యారు. ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటలకు తిమ్మాపురం గ్రామ పరిధిలోని తిరుమల నూలు పరిశ్రమ సమీపంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న కారు కుడివైపు వెనుక టైరు పంక్చర్ అయింది. దీంతో కారును రోడ్డు పక్కన ఆపుకుని టైరు మార్చుకుంటుండగా గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి ఇద్దరినీ ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ సంఘటనలో రవికిషోర్ అక్కడికక్కడే మృతి చెందగా, కృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు, నాదెండ్ల 108 వాహన సిబ్బంది గాయపడిన కృష్ణను అంబులెన్స్‌లో చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కృష్ణ ఆదివారం ఉదయం మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి పోలీసులు వివరాలు నమోదు చేసుకునారు. ఢీకొట్టి వెళ్లిన వాహనం వివరాల కోసం పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడు కృష్ణ బంధువు వీర్రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొట్టి..



మృతుడు నాగరాజు ఫైల్ ఫొటో

ఫిరంగిపురం, సెప్టెంబరు 15: ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి ఫిరంగిపురం - వేములూరిపాడు మధ్య గుంటూరు - కర్నూలు రహదారిపై జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని వేములూరిపాడు గ్రామానికి చెందిన నాగరాజు (25) రాత్రి తాజ్ హోటల్ వద్దకు బిర్యానీ కోసం వచ్చి రోడ్డుపై నడిచి వెళ్తుండగా విజయవాడ నుంచి కడప వెళ్తున్న బస్సు నాగరాజును ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టి..

ప్రత్తిపాడు, సెప్టెంబరు 15: మండల పరిధిలోని తిక్కిరెడ్డిపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మరణించిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. ప్రత్తిపాడుకు చెందిన నుదురుపాటి ప్రకాష్ (25) తన పల్సర్ బైక్‌పై గుంటూరు వెళ్తున్నాడు. గుంటూరు నుంచి చీరాల వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా వాహనం నడుపుతూ ఢీకొట్టాడు. బైక్‌పై ఉన్న ప్రకాష్‌కు బలమైన దెబ్బ తగలడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. మరో ద్విచక్ర వాహనంపై చీరాలకు చెందిన భార్యభర్తలు ఉన్నారు. వీరికి తీవ్ర గాయాలు కాగా గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు.

బాలికపై లైంగిక దాడి

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 15 : ఎనిమిదేళ్ల బాలికపై యువకుడు అత్యాచారం చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలంలోని ఓ గ్రామంలో డొక్కా రమేష్ ఓ బాలికను నీతో పని ఉందని మాయమాటలు చెప్పి డాబామీదకు తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఆ బాలిక ఏడ్చుకుంటూ డాబా పైనుంచి కిందకి రాగా నిందితుడు రమేష్ తల్లి గమనించింది. బాలికకు రక్తస్రావం అవుతుండటంతో నీళ్లతో శుభ్రం చేసింది. ఇంటికి వెళ్లిన బాలిక జరిగిన విషయాన్ని తన తల్లికి చెప్పింది. సంఘటనపై బాలిక తల్లి వారి బంధువులతో కలిసి చందోలు పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చందోలు ఎస్సై ఆర్.స్వామి శ్రీనివాస్ తెలిపారు.

4 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

మాచర్ల రూరల్, సెప్టెంబరు 15: నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ 4 క్రస్ట్‌గేట్ల ద్వారా ఆదివారం అధికారులు నీటిని విడుదల చేశారు. 4 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 32,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కాగా నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం 590.00 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,160 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 4679 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,313 క్యూసెక్కులు, 4 క్రస్ట్ గేట్ల ద్వారా 32,400 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 78,952 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 78,952 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నేటి ఎస్పీ గ్రీవెన్స్ రద్దు

గుంటూరు, సెప్టెంబరు 15: ప్రతి సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సెప్టెంబర్ 16న సోమవారం "మిలాద్ ఉన్ నబీ" పండగ సందర్భంగా తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దూరప్రాంతాల నుంచి ఫిర్యాదులు ఇవ్వడానికి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి రాదలచిన ప్రజలు ఈ విషయాన్ని గమనించాల్సిందిగా సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.35
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	128, 138,148
చికెన్ విత్ స్కిన్	240.00
చికెన్ స్కిన్ లెస్	250.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు రూ.50వేలు చెక్కును ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్‌కు అందజేస్తున్న కోడూరి సింగయ్య, కరణం రవీంద్రబాబు

ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్‌కు రూ.50 వేలు అందజేత

బాపట్ల,సెప్టెంబరు 15 : ముంచెత్తిన వరదలతో సర్వం కోల్పోయిన బాధితులకు తమవంతు సహాయంగా బాపట్ల మండలం చెరువుజమ్ములపాలెం గ్రామానికి చెందిన కోడూరి సింగయ్య, శివకుమారిలు రూ.50 వేలు అందజేశారు. ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్‌కు పంపించవల్సిందిగా ఆదివారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మను కలిసి చెక్కు అందజేశారు. ఇదేస్ఫూర్తితో ప్రతి ఒక్కరు ముందుకొచ్చి బాధితులకు సాయం చేయాలని ఎమ్మెల్యే నరేంద్రవర్మ కోరారు. విరాళాలు ఇచ్చిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విరాళం ఇచ్చేవారు చెక్కు రూపంలో ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం అందజేత

వరద బాధితులను ఆదుకునేందుకు నేనున్నానంటూ బాపట్ల పట్టణం పటేల్ నగర్‌కు చెందిన కరణం రవీంద్రబాబు తనవంతుగా రూ.50 వేల చెక్కును ఆదివారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు అందజేశారు. ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ ద్వారా ఈ మొత్తాన్ని బాధితులకు సాయం చేసేందుకు వినియోగించాలని కోరారు. విరాళం అందించిన రవీంద్రబాబును ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలీసు అసోసియేషన్ సహాయం



వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు

భట్టిప్రోలు, (కొల్లూరు), సెప్టెంబరు 15 : వరద బాధితులకు పోలీసు అసోసియేషన్ తమవంతు సహాయం అందజేశారు. ఏపీ పోలీసు అధికారుల సంఘం ముఖ్య సలహాదారు అద్దేపల్లి గణపతి ఆధ్వర్యంలో మండలంలోని చింతమోటు, గుంటూరుగూడెంలోని 150 కుటుంబాలకు 12 రకాల వస్తువులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గణపతి మాట్లాడుతూ, వరద ముంపు గ్రామాల్లో ప్రత్యక్షంగా వారి కష్టాలను చూసి తాము కూడా వారిని ఆదుకోవాలని ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో 6వ బెటాలియన్ ఆర్ఎస్ఐ భుజంగరావు, బాబుజగన్నాథరావు, మన్మథరావు, సోమరాజు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ



పల్లెపాలెంలో వరద బాధితులకు నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుడు రమేష్ తదితరులు

రేపల్లె, సెప్టెంబరు 15 : కృష్ణానది వరదల కారణంగా నష్టపోయిన వరద బాధితులకు చేయూతనివ్వాలనే ఉద్ధేశంతో విల్లీఆర్స్ ఫౌండేషన్ వారు చేస్తున్న సేవలు అభినందనీయమని టీడీపీ నాయకుడు రమేష్ అన్నారు. భట్టిప్రోలు మండలం ఓలేరు పల్లెపాలెంలో వరద బాధితులకు విల్లీఆర్స్ పెద్దపులివర్రు వారు సమకూర్చిన దుప్పట్లు, నిత్యావసర వస్తువులను ఆదివారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వరదల కారణంగా పల్లెపాలెంలో కుటుంబాలన్నీ తీవ్ర నష్టపోయారని వారికి చేయూతనివ్వాలనే ఉద్ధేశంతో నిత్యావసర వస్తువులు, దుప్పట్లను పంపిణీ చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, విల్లీఆర్స్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక

బాపట్ల, సెప్టెంబరు 15 : ఐదు దశాబ్దాల తర్వాత తాము విద్యాబుద్దులు నేర్చుకున్న కళాశాలలో కలుసుకోవటం ఎంతో సంతోషంగా ఉందని బాపట్ల వ్యవసాయ కళాశాల పూర్వవిద్యార్థులు అన్నారు. 1974వ సంవత్సరంలో చదువుకొని వివిధ వృత్తులలో అనేక ప్రాంతాలలో స్థిరపడిన వారంతా ఆదివారం ఒకే వేదికపైకి వచ్చారు. 60 మంది పూర్వవిద్యార్థులు కళాశాలకు వచ్చి గడిచిన మధురస్మృతులను నెమరవేసుకున్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ కళాశాల ప్రస్తుత స్థితిని, ఇప్పటి మౌలిక వసతులను నాటి వసతులతో పోల్చి చూచుకొని తమ కళాశాల సర్వతోముఖాభివృద్ధి చెందిందని సంతోషం వ్యక్తం చేశారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రసూనా రాణి మాట్లాడుతూ ఇప్పుడు కళాశాలలో చేరే విద్యార్థుల సంఖ్య పెరగటంతో ఒక్కొక్క క్లాస్‌లో కూర్చొనే విద్యార్థుల సంఖ్య కూడా పెరిగిందని చెప్పారు. దానివల్ల విద్యార్థుల సౌకర్యం కోసం తరగతి గదులను తదనుగుణంగా అభివృద్ధి చేయటం జరిగిందన్నారు. దీనికి పూర్వవిద్యార్థులు ఇతోధికంగా సాయం చేస్తే బాగుంటుందని తెలిపారు. అసోసియేట్ డీన్ కోరిక మేరకు 1974వ సంవత్సరం విద్యార్థిని మయూరవల్లి 4 టన్నుల టవర్‌ఎయిర్ కండీషన్‌కు అవసరమైన ఖర్చును తాను భరించగలనని ప్రకటించారు. ఈ సహాయంను తాను ఒంగోలులోని విద్యోన్నతి ఫౌండేషన్ అనే ఎన్జీవో ద్వారా అందజేస్తానని తెలిపారు. మిగిలిన పూర్వవిద్యార్థులు కూడా కళాశాల విద్యార్థుల సౌకర్యం కొరకు తమ శక్తి మేర ఆర్థికసహాయం చేయటానికి ముందుకొస్తామని చెప్పారు.



బాపట్ల వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థులతో ఆచార్యులు

శ్రీ బగళాముఖిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 15 : శ్రీబగళాముఖి అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. పిట్టలవానిపాలెం మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి ఆలయానికి విచ్చేసిన హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులకు ఆలయ మర్యాదలతో ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి వేద స్వస్తీతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం వారిని జ్ఞాపిక, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. వారితోపాటు స్టేట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీకృష్ణ ప్రణీత్ ఉన్నారు. అమ్మవారి ఆలయ విశేషాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనారాయణ దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ కార్యనిర్వాహణాధికారి నరసింహమూర్తి

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

● ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్



విజేతగా నిలిచిన క్రికెట్ టీమ్‌తో ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల, సెప్టెంబరు 15 : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. బాపట్ల క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే నరేంద్రవర్మతోపాటు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ పాల్గొని క్రికెట్ బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. యువకులు చదువుతోపాటు క్రీడలలో రాణించాలని ఆయన కోరారు. జిల్లాలో క్రీడల కోసం రానున్న రోజుల్లో స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. క్రికెట్ అంటే చిన్నప్పటి నుంచి తనకు ఇష్టమైన ఆట అని, విద్యార్థి దశ నుంచి క్రికెట్‌పై మక్కువ చూపేవాడినని ఆయన చెప్పారు. బాపట్ల జిల్లాలోని క్రీడాకారుల కోసం ఆరు నియోజకవర్గాలకు సంబంధించి లీగ్‌మ్యాచ్‌లు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ క్రికెట్ అసోసియేషన్‌కు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గంటా అంజిబాబు, అసోసియేషన్ అధ్యక్షుడు రఘు, కార్యదర్శి దొప్పలపూడి రామ్మోహనరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, బి.స్టాన్లీవిమల్‌కుమార్, కరీమ్ తదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలలో ఎమ్మెల్యే వేగేశన పూజలు

బాపట్ల, సెప్టెంబరు 15 : పట్టణంలోని 17వ వార్డు శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమానికి పార్టీశ్రేణులతో కలిసి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పాల్గొన్నారు. వినాయక మండపాన్ని సందర్శించి స్వామివారికి పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నసంతర్పణలో పాల్గొని భక్తులకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొండుభొట్లపాలెం గణేష్‌యూత్ ఆధ్వర్యంలో...



బాపట్లలోని 17వవార్డులో వినాయకునికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ, భక్తులు

బాపట్ల మండలంలోని కొండుభొట్లపాలెం చిన రామాలయం దగ్గర గణేష్‌యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం దగ్గర ఆదివారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీశ్రేణులు, కమిటీ సభ్యులతో కలిసి విఘ్నేశ్వరునికి పూజలు చేసి అక్కడ జరిగిన అన్నసంతర్పణలో భక్తులకు వడ్డించారు. జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు మద్దుల కొండలు, టీడీపీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ, తెలుగుయువత అధ్యక్షుడు ఉమ్మారెడ్డి వెంకటేష్, మహిళా నాయకులు చెన్నుపాటి హైమావతి, కూచిపూడి ఝాన్సీరాణి, షేక్ నజ్మా, కమిటీ సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.

వినాయకుని లడ్డు రూ.3.35 లక్షలు



3 లక్షల 35 వేల రూపాయలకు లడ్డును పాడుకొని తీసుకెళుతున్న భక్తులు

బాపట్ల మండలంలోని అప్పికట్ల గణేష్‌యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకచవితి ఉత్సవాలలో భాగంగా వినాయకుని లడ్డుకు వేలంపాట నిర్వహించారు. కుర్రా శ్రీనివాసరావు 3 లక్షల 35 వేల రూపాయలకు లడ్డును వేలం పాటలో దక్కించుకున్నారు. అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని గ్రామస్తులు, కమిటీ సభ్యులు భక్తులతో కలిసి భారీ ఊరేగింపుతో నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, యువత పాల్గొన్నారు

17వ వార్డులో రూ.25 వేలు

బాపట్ల పట్టణంలోని 17వ వార్డులో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాలలో ఆదివారం వినాయకుని లడ్డుకు వేలంపాట నిర్వహించారు. వేలంపాటలో ఎం.చైతన్య లడ్డును రూ.25 వేలకు దక్కించుకున్నారు. స్వామివారి వద్ద 9 రోజులుగా పూజలు అందుకున్న లడ్డును ఊరేగింపుగా తీసుకెళ్ళారు. అనంతరం వినాయకుని విగ్రహాన్ని భారీ ఊరేగింపుతో నిమజ్జనానికి తీసుకెళ్ళారు. ఈ కార్యక్రమంలో వరసిద్ది వినాయక భక్తమండలి వారు పాల్గొన్నారు.

వైభవంగా గణేశుని నిమజ్జన కార్యక్రమాలు

బాపట్ల రూరల్, సెప్టెంబరు 15 : బాపట్ల మండలంలోని గ్రామాలలో 9 రోజులు పూజలు అందుకున్న గణనాధుని నిమజ్జన కార్యక్రమాలను ఆదివారం భక్తులు వైభవంగా నిర్వహించారు. బాపట్ల పరిసర ప్రాంతాలు నుంచి గణేశుని విగ్రహాలను నిమజ్జనానికి భక్తులు భారీ వాహనాలపై సూర్యలంక తీరానికి తరలివెళ్ళారు. సూర్యలంక తీరంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా బాపట్ల రూరల్ పోలీసులు చర్యలు చేపట్టారు.

వినాయక లడ్డు రూ.95,116

కర్లపాలెం, సెప్టెంబరు 15 : కర్లపాలెంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో 9 రోజులుగా భక్తులచే ప్రత్యేక పూజలు అందుకున్న వినాయక విగ్రహాన్ని ఆర్యవైశ్యులు పెద్దఎత్తున కర్లపాలెం పురవీధులలో భారీ ఊరేగింపు నిర్వహించారు. విగ్రహం ముందు బాలికలు కూచిపూడి నృత్యాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. విగ్రహం ముందు ఏర్పాటు చేసిన లడ్డును ప్రముఖ కిరాణా వ్యాపారవేత్త పారేపల్లి బాలకృష్ణమూర్తి కుమారుడు నాగరాజు రూ.95,116కు వినాయక లడ్డును దక్కించుకున్నారు.

మట్టి వినాయక విగ్రహం నిమజ్జనం

కర్లపాలెం పంచాయతీ అగ్రహారంలో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహాన్ని కర్లపాలెం పురవీధులలో బ్రాహ్మణులు ఆదివారం ఘనంగా ఊరేగించారు. అగ్రహారంలోని జనార్దనస్వామి దేవాలయ ప్రాంగణంలో మట్టి గణపతిని నిమజ్జనం గావించారు. కార్యక్రమాలను బృందవనం శ్రీనుబాబు, శ్రీనివాసచార్యులు పరిమి దత్తాత్రేయశర్మ, పరిమి వరదరాజు, పార్ధసారధి పర్యవేక్షించారు.

వినాయక విగ్రహం ట్రాక్టర్ నడిపిన వేగేశన నరేంద్రవర్మ



యాజలి గౌడపాలెంలో వినాయక విగ్రహ ట్రాక్టర్‌ను నడుపుతున్న ఎమ్మెల్యే వేగేశన

కర్లపాలెం,సెప్టెంబరు 15 : మండలంలోని యాజలి పంచాయతీలో పుట్టలమ్మతల్లి గుడి వద్ద గౌడ కులస్థుల కమిటీవారు ఏర్పాటు చేసిన వినాయకస్వామి నిమజ్జన కార్యక్రమంలో ఆదివారం బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ పాల్గొని వినాయక విగ్రహం ఉన్న ట్రాక్టర్‌ను ఆదివారం నడిపారు. వినాయక విగ్రహ కమిటీ సభ్యులకు గౌడసంఘీయులకు నరేంద్రవర్మ అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నరేంద్రవర్మను గౌడకులస్థులు, కమిటీవారు దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

కర్లపాలెం గౌడపాలెం రామాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ఆదివారం డప్పువాయిద్యాలు, భారీ మేళతాళాలతో ఘనంగా ఊరేగింపు చేశారు. తుంగభద్రకాల్వలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. కర్లపాలెంలోని గౌడపాలెం గ్రామస్తులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి తరలిన వినాయక విగ్రహాలు

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 15 : మండలంలోని ఖాజీపాలెం కోదండరామాలయం, చందోలు ఆర్యవైశ్యకళ్యాణ మండపంలో వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాలను నిర్వాహకులు గ్రామాలలో భారీగా మేళతాళాలతో ఊరేగింపుతో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువకులు, గ్రామపెద్దలు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే వేగేశన చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న డాక్టర్ గ్లోరియానేట్

అంకితభావానికి నిలువెత్తు నిదర్శనం సీఎం చంద్రబాబు

పిట్టలవానిపాలెం,సెప్టెంబరు 15 : కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు కావటంతో పిట్టలవానిపాలెం మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరి యానేట్ సోపాటి ఆధ్వర్యంలో సంగుపాలెం గ్రామంలో ఆదివారం స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ తోడేటి నెహమ్య, బర్మా సుబ్బయ్య, చెరుకూరి సంపత, మట్టలపూడి ప్రసన్న, బర్మా ఝాన్సీ తోడేటి మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మహర్షి ఆశ్రమ గోశాలలో కల్యాణ మహోత్సవం

బాపట్ల,సెప్టెంబరు 15 : మండలంలోని మహర్షి ఆశ్రమ గోశాలలో ఆదివారం శ్రీ సిద్దిబుద్ధి సమేత సంపత్ గణపతి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత సుదర్శనయాగం, గోపూజ జరిపి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. బి.బాబునాగేంద్ర, పద్మలత దంపతులు, బిఎస్సార్ నారాయణభట్టు, మేడూరి శ్రీరామచంద్రమూర్తి, చిలకమర్తి శ్రీరామశర్మ, కాళీదాసు, కూనపరెడ్డి గాంధీ, భాగ్యలక్ష్మి, ఉమావెంకట సుబ్బరాయుడు, సుభాషిణి, కొమ్మినేని శ్రీనివాసరావు, పద్మజ, మలిశెట్టి భ్రమరాంబ, మామిడి పద్మజ, ప్రసన్నదేవి, ఉషా, సరిత, లక్ష్మయ్య, కారుమంచి వెంకట్రావు, శ్రీదేవి దంపతులు పీటలపై కూర్చొని కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమంలో యామిని, వీరకుమారి, కొర్రా శ్రీనివాసరావు, శ్రీదేవి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు

బాపట్ల,సెప్టెంబరు 15 : పట్టణంలోని పటేల్ నగర్ 5వలైన్‌లో శ్రీలక్ష్మీగణపతి సమితి ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం స్వామివారికి పుష్పయాగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో శ్రీలక్ష్మీగణపతి సమితి సభ్యులు కన్నా గోపాలరావు, గంటా సాయిబాబు పర్యవేక్షణలో భక్తులు పూజలు నిర్వహించారు. ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించి నిమజ్జన కార్యక్రమాన్ని జరిపారు.

బస్సు డ్రైవర్లకు వేతనాలు పెంచాలి

రేపల్లె, సెప్టెంబరు 15 : ఆర్టీసీలో బస్సు డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తున్న వారి వేతనాలను పెంచాలని, బస్సు కార్డులు తక్షణమే ఇవ్వాలని సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో రేపల్లె ఆర్టీసీ డిపో పరిధిలో పని చేస్తున్న ప్రైవేటు హయ్యర్ బస్సు డ్రైవర్లు, వర్కర్లు, యూనియన్‌ల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేతనాల పెంపుదల చేయటానికి యాజమానులు పూనుకోవాలని లేనిపక్షంలో ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్.వెంకట్, సుబ్రహ్మణ్యం, భాను, సాయి, ఇమ్రాన్ పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

రేపల్లె, సెప్టెంబరు 15 : నగరం మండలం ఏలేటిపాలెం గ్రామంలో సపోట తోటల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు శనివారం రాత్రి దాడులు నిర్వహించారు. నగరం ఎస్ఐ భార్గవ్ మాట్లాడుతూ ఏడుగురు పేకాటరాయుళ్ళను అదుపులోకి తీసుకున్నామని, వారి వద్ద నుంచి రూ.16,150 స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో గేదెల చావిడి దగ్ధం

● మంటల్లో ఆరు పశువులకు గాయాలు

చెరుకుపల్లి, సెప్టెంబరు 15 : విద్యుత్ షార్టుసర్క్యూట్‌తో పశువుల చావిడి పూర్తిగా దగ్ధమైన సంఘటన ఇది. మండలంలోని కూరేటివారిపాలెం గ్రామంలో శనివారం రాత్రి విద్యుత్ షార్టుసర్క్యూట్‌తో పశువుల చావిడి పూర్తిగా దెబ్బతిని చావిడిలో ఉన్న ఆరు పశువులకు మంటలలో గాయాలయ్యాయి. రెండు పాలదూడలు మంటలలోనే పూర్తిగా కాలిపోయినట్లు పశువుల నిర్వాహకుడు వెంకట్‌చరణ్ తెలిపారు. సుమారుగా లక్షలలో నష్టం వాటిల్లినట్లు బాధితుడు చెప్పారు. పశువుల పాకాను ఎస్ఐ అనిల్‌కుమార్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం విక్రేత అరెస్టు : 18 సీసాలు స్వాధీనం

బాపట్ల రూరల్, సెప్టెంబరు 15 : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ మహిళను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే... బాపట్ల మండలం జమ్ములపాలెం గ్రామంలో గుడిపల్లి రాగమ్మ అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా బాపట్ల రూరల్ పోలీసులు దాడి నిర్వహించి ఆమెను అదుపులోకి తీసుకొని ఆమె వద్ద ఉన్న 18 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేశారు. అక్రమంగా మద్యం విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బాపట్ల రూరల్ సీఐ గంగాధరరావు హెచ్చరించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

బాపట్ల, సెప్టెంబరు 15 : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. సోమవారం మిలాద్ ఉన్‌నబీ పండుగ సందర్భంగా రద్దు చేసినట్లు చెప్పారు. దూరప్రాంతాలు నుంచి ఫిర్యాదులు ఇవ్వటానికి రాదల్చిన వారు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మోక్షగుండం జయంతి వేడుకలు

బాపట్ల, సెప్టెంబరు 15 : బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన పటానికి పుష్పాంజలి ఘటించారు. పూర్వ విద్యార్థిని, గరల్స్ క్యాడిట్ ఇన్‌స్ట్రక్టర్ వాకా గాయత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థినులకు విలువైన సూచనలను చేశారు. విద్యార్థి దశ నుండే కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకొని వారి ఆలోచనలు మెరుగుపర్చుకుంటూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో ముందుకు నడవాలన్నారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ రోజులలో విద్యార్థులు ముందుకు దూసుకెళుతున్నారన్నారు. విద్యార్థుల ఎదుగుదల ముందుతరాలకు ఆదర్శం కావాలన్నారు. ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ సాంకేతిక పరమైన ఆలోచనలతో అభివృద్ధిని కనబరుస్తూ తమకు కావాల్సిన వనరులను సద్వినియోగం చేసుకొని ప్రగతిపథంలో పయనించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు దొప్పలపూడి రామ్మోహనరావు, జి.దిలీప్‌కుమార్, జాయింట్ సెక్రటరి కొమ్మినేని హరిపద్మప్రసాద్, కోశాధికారి టి.రామకృష్ణ, ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ఐ.హరిత, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో పూర్వవిద్యార్థిని వాకా గాయత్రిని సన్మానిస్తున్న ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు

రోటరీ క్లబ్ సేవలు ప్రశంసనీయం

● డిస్ట్రిక్ గవర్నర్ శరత్‌చౌదరి

బాపట్ల,సెప్టెంబరు 15 : ప్రపంచదేశాలలో రోటరీక్లబ్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ శరత్‌చౌదరి అన్నారు. బాపట్ల రోటరీక్లబ్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. విజయలక్ష్మీపురంలోని రోటరీకళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో బాపట్ల రోటరీక్లబ్ సభ్యులను అభినందించారు. వరద బాధితులు 5వేల మందికి నిత్యావసర సరుకుల కిట్‌లు అందించటం అభినందనీయమన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలకు కూలింగ్ వాటర్ క్యాన్‌లను అందజేశారు. వచ్చే 3 సంవత్సరాలలో బాపట్లలో రోటరీ డయాగ్నస్టిక్ టెస్టింగ్ సెంటర్‌ను ప్రారంభించటం జరుగుతుందని, దీని ద్వారా ప్రజలకు తక్కువ ఫీజులతో పరీక్షలు చేస్తామని చెప్పారు. అనంతరం గవర్నర్ శరత్ చౌదరిని స్థానిక కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఎం.వంశీ కృష్ణ, బాపట్ల అధ్యక్షుడు కొల్లపూడి ఉపేంద్రగుప్తా, కార్యదర్శి వేజండ్ల శ్రీనివాసరావు, కోశాధికారి వి.వేణుగోపాల్, సీనియర్ సభ్యులు ఏలూరి హరిబాబు, ఎస్.రమేష్ బాబు, ఎం.సుధీర్‌కుమార్, కొల్లా శ్రీనివాసరావు, బి.రామసుబ్బారావు, దేవకి సుబ్రహ్మణ్యం, జీవీ ఆంజనేయులు, గొల్లపూడి బాలాజి, తటవర్తి సుబ్బారావు, నల్లమల్లి శ్రీనివాసరావు, బాలకృష్ణ, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు కూలింగ్ వాటర్ క్యాన్‌లు అందజేస్తున్న రోటరీక్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ శరత్‌చౌదరి

మెగా ఉచిత వైద్యశిబిరంలో 675 మందికి పరీక్షలు

చెరుకుపల్లి, సెప్టెంబరు 15 : గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పేద ప్రజలకు మెరుగైన గుండె పరీక్షలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు రమేష్ హాస్పటల్ బిజినెస్ హెడ్ డాక్టర్ యలవర్తి కార్తీకచౌదరి అన్నారు. చెరుకుపల్లిలోని ఆస్టర్ రమేష్ హాస్పటల్ వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉచిత మెగా వైద్యశిబిరాన్ని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేశామన్నారు. వైద్యశిబిరంలో 675 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు పీజే సందీప్, ఆకీఫ్‌అహ్మద్‌బేగ్, బాలభాస్కర్, భరత్‌చంద్ర, నీరెన్ రావెల, దీప్తి పాల్గొని వైద్యశిబిరంలో గుండె పరీక్షలు, బీపీ, షుగర్, ఈసీజీ, టిఎఫ్‌టి మొదలగు పరీక్షలను అందించారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ బిజినెస్ హెడ్ రావి భరత్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, టీడీపీ నాయకులు మొహమాటం రాధాకృష్ణమూర్తి, కందుల వెంకటేశ్వరరావు, గోగినేని వసుధ, వంగర చక్రవర్తి, మండవ తాతాజీ,వాకా శ్రీనివాస్, దివి రాంబాబు పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహించి రికార్డును పరిశీలిస్తున్న వైద్యులు

సింగరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య సేవలు

కర్లపాలెం సెప్టెంబరు 15 : 225 మందికి కంటి శుక్లాల పరీక్షలు నిర్వహించగా 145 మందికి శుక్లాల ఆపరేషన్ చేయాలని డాక్టర్ నిర్ధారించారని సింగరాజు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు పెనుమెత్స కృష్ణంరాజు, సత్యనారాయణరాజు సంయుక్తంగా తెలిపారు. కర్లపాలెంలోని శ్రీపెద్దింటమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో ఆదివారం సింగరాజు చారిటబుల్ ట్రస్ట్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శంకర నేత్రాలయం వైద్యులు ఆదివారం కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. శంకర నేత్రాలయ వైద్యులు బాఫిన్, మరియ, అరుణ్‌చంద్రలు రోగులకు వైద్య సేవలందించారు. ఆపరేషన్‌లు నిర్ధారించిన 145 మందిని విడతల వారీగా పెదకాకాని శంకర నేత్రాలయానికి తీసుకెళ్ళి ఆపరేషన్‌లు చేయిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, అచ్యుత వెంకటేశ్వర్లు, బాలవికాస్ ఉపాధ్యాయురాలు శ్రీదేవి, బొమ్మనబోయన సాంబయ్య, తుమ్మల శ్రీనివాసరావు, జిడుగు వెంకటేశ్వర్లు, సోమరాజు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న శంకర కంటి ఆసుపత్రి వైద్యులు

కొనసాగుతున్న వైద్యుల ఆందోళన

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 15 : పీజీ వైద్యవిద్యలో ఇన్ సర్వీసు కోటాను 15శాతానికి తగ్గించడాన్ని నిరసిస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీల) వైద్యాధికారులు చేపట్టిన ఆందోళన కొనసాగుతోంది. సోమవారం కూడా ఓపీలను బహిష్కరించాలని వారు నిర్ణయించుకున్నారు. వైద్యారోగ్యశాఖ ముఖ్య అధికారులతో జరిగిన చర్చలు విఫలం కావడంతో పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్ నేతలు ఆదివారం విజయవాడలో సమావేశమయ్యారు. సోమవారం సాయంత్రం లోపు ప్రభుత్వం సమస్యను పరిష్కరించకపోతే తదుపరి కార్యాచరణకు దిగాలని నిర్ణయించారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పీజీ విద్యలో ఇన్ సర్వీసు కోటాను తగ్గిస్తూ జారీ చేసిన జీవో నంబరు 85ను రద్దు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాహుల్ తెలిపారు.

ఇద్దరు డీఎస్పీల నియామకం

ఒంగోలు (క్రైం), సెప్టెంబరు 15 : మార్కాపురం డీఎస్పీగా యు.నాగరాజు, కనిగిరి డీఎస్పీగా ఎం. మహేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదివారం ఉత్తర్వులు ఇచ్చారు. మార్కాపురం డీఎస్పీ పోస్టు రెండు నెలల నుంచి ఖాళీగా ఉంది. కనిగిరి డీఎస్పీగా పనిచేసిన రామరాజు గత నెలలో ఉద్యోగ విరమణ చేశారు. దీంతో అక్కడ ఖాళీ ఏర్పడింది. ఈ రెండు పోస్టులను ఇప్పుడు భర్తీ చేశారు.

'స్వామి' కోసం చెప్పులు లేకుండా..


అభిమానిని సన్మానిస్తున్న మంత్రి స్వామి

కొండపి, సెప్టెంబరు15: కొండపి శాసనసభ్యుడిగా డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి హ్యాట్రిక్ విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ కొర్రపాటి ప్రసాద్ సంవత్సరకాలం చెప్పులు లేకుండా తిరుగుతానని సంకల్పించాడు. అలాగే కొనసాగాడు. ఆదివారం కొండపికి వచ్చిన స్వామిని కలిసి విషయం చెప్పి కొత్త చెప్పులు స్వామి సమక్షంలో వేసుకున్నాడు. దీనికి ఆనందం వ్యక్తం చేసిన మంత్రి స్వామి ప్రసాద్‌ను శాలువాతో సన్మానించా రు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశ అభివృద్ధి, సంక్షేమం

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 15: భారతీయ జనతా పార్టీతోనే దేశ అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ కోస్తా జోనల్ ఇన్‌చార్జి జయప్రకాష్ పేర్కొన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారం సాయంత్రం ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పీవీ.శివా రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సభలో జయప్రకాష్ మాట్లాడు తూ గత పదేళ్ళ కాలంలో నరేంద్రమోదీ నాయక త్వంలో దేశాన్ని ప్రపంచంలోనే అగ్రగ్రామిగా నిలిపేందుకు పాటుపడుతున్నారని చెప్పారు. ఒక వైపు పేద, బడుగు, బలహీనవర్గాలకు సంక్షేమ ఫలాలను అందిస్తూనే మరో వైపు దేశ అభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు. గత పదేళ్ళ కాలంలో బీజేపీ ప్రభుత్వంలో సాధించిన విజయా లను ప్రజలకు వివ రించి ప్రతి ఒక్కరూ పార్టీ సభ్యత్వం తీసుకునే విధంగా పాటు పడాలని చెప్పారు. అందుకోసం శ్రేణులు పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం శివారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో బీజేపీ సభ్యత్వ నమోదుకు చేపడు తున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం సభ్యత్వ నమోదును ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పీవీ.కృష్ణారెడ్డి, శెగ్గం శ్రీనివాసులు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీని పరిరక్షించుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 15: ఆర్టీసీని రక్షించుకునేందుకు కార్మికులందరూ సమన్వయంతో పనిచేయాలని అఖిలభారత కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య పిలుపునిచ్చారు. ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం జిల్లా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరన ఆయన మాట్లాడుతూ ఫెడరేషన్ ఏర్పడక ముందు ఆర్టీసీ పరిస్థితులు మరింత దారుణంగా ఉండేవన్నారు. అలాంటి నేపథ్యంలో సమస్యలపై ఉద్య మాలు చేసే సంఘం అవసరమని భావించి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్‌ను స్థాపించడం జరిగిం దన్నారు. 1979 నుంచి ఇప్పటి వరకు ఆర్టీసీని రక్షించుకోవడంలో అనేకమంది కార్యకర్తలు పనిచే సిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్టీసీ ప్రైవేటీకరణ వేగవంతం అవుతుందన్నారు. ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు వారికి అప్పజె ప్పడం, అనేక విభాగాలను కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విభాగాలకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. ఇంకొక వైపు రిక్రూట్‌మెంట్ లేకపోవడం, పాత బస్సులను కొనసాగించడం, కొత్త బస్సుల కొనుగోలుకు అంగీకారం తెలపకవడం లాంటి సమస్యలు ఉద్యోగులను, కార్మికులను ఇబ్బందులు పెడుతు న్నాయని తెలిపారు ఈ నేపథ్యంలో ఆర్టీసీని పరిరక్షించుకునేందుకు సమన్వయంతో ముందుకు పోవాల్సిన అవసరం వచ్చిందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రతినిధులు మా దాల వెంకట్రావు, ఎం.అయ్యపరెడ్డి, ఎస్‌కే.జిలాని, కట్టా సుబ్రహ్మణ్యం, దివాకర్, గంగాధర్ తిరుప తిరెడ్డి, అల్లాడి సుబ్బారావు, పి.శ్రీనివాస్, సీఐటీ యూ నాయకులు జి.శ్రీనివాసులు, హరిబాబు, వెంకటేశ్వర్లు, మీరావళి, రవి తదితరులు పాల్గొ న్నారు. అనంతరం సీపీఎం జాతీయ ప్రధాన కా ర్యదర్శి సీతారాం ఏచూరికి ఘనంగా నివాళుల ర్పి ంచారు.

అట్టహాసంగా క్రీడాపోటీలు ప్రారంభం

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 15: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా ఒంగోలులో ఆదివారం ఉపాధ్యాయులకు ఆటపోటీలను అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్థానిక డీఆర్‌ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి పోటీలను యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి డి.వీరాంజనేయులు ప్రారంభించారు. ముందుగా క్రికెట్ పోటీలు హెచ్‌ఎంపాడు, పొదిలి జట్ల మధ్య ఉత్కంఠ భరితంగా జరిగింది. క్రికెట్ పోటీలకు 12జట్లు వచ్చాయి. వాలీబాల్ పోటీల్లో ఎనిమిది జట్లు పాల్గొనగా టంగుటూరు జట్టు ఫైనల్‌కు అర్హత సాధించింది. షటిల్ పోటీలకు 20 జట్లు హాజరయ్యాయి. ఈ పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. కార్యక్రమంలో క్రీడల కన్వీనర్ అబ్దుల్‌హై, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్.రవి, సహాధ్యక్షురాలు ఉమామహేశ్వరి, కోశాధికారి చిన్నస్వామి, జిల్లా కార్యదర్శులు బాలవెంకటేశ్వర్లు, వెంకటేశ్వర రెడ్డి, జేవీవీ రాష్ట్ర నాయకులు కె.సుబ్రహ్మణ్యాచారి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖలో విజిలెన్స్ కలకలం

మద్రిపూడి, సెప్టెంబరు 15 : మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో జరిగిన అవకతవకలపై ఇటీవల ఆశాఖ విజిలెన్స్ అధికారులు నిర్వహించిన విచారణ కలకలం రేపింది. గుళ్ళసముద్రం గ్రామానికి చెందిన చంద్రమౌళి అనే వినియోగదారుడు ట్రా న్స్‌ఫార్మర్ ఏర్పాటులో ఏఈ రామకృష్ణారెడ్డి పలు అవకతవకలకు పాల్పడుతున్నారంటూ ఆశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో ఒంగోలు విజిలెన్స్ డీఈ, దర్శి డీఈలు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. పలువురు గ్రామాల రైతుల నుంచి వాంగ్మూలాలను నమోదు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో పెద్దఎత్తున ము డుపులు తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేశారని వినియోగదారులు కొంతమంది లిఖితపూర్వకంగా అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఉన్నతాధికారులు ఏఈ రామకృష్ణారెడ్డి, ఏఎల్ఎం బాలకృష్ణారెడ్డిలపై సస్పెన్షన్ వేటు వేశారు. పూర్తిస్థాయి విచారణ జరిగితే మరికొంత మంది క్షేత్రస్థాయి సిబ్బందిపై కూడా చర్య లు ఉంటాయని తెలుస్తోంది. పొదిలి ఏడీఏ శ్రీనివాసులుకు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు దర్శి డీఈ కరీం తెలిపారు.

జేసీఐ సేవా కార్యక్రమాలు అభినందనీయం

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 15: జేసీఐ నిర్వహిస్తున్న వివిధ సామాజిక, సేవా కార్యక్రమాలు అభినందనీయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్(జేసీఐ) వారోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఒంగోలులోని కాపు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ముగింపు సభకు ముఖ్యఅతిథిగా మంత్రి హాజరై మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం, విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేలా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

అనంతరం కమలపత్ర పురస్కారాన్ని దాది ఆంజనేయులు, అవుట్ స్టాండింగ్ యంగ్‌పర్సన్ అవార్డును అనంతపురం ట్రైనింగ్ కలెక్టర్ బి.వినూత్నకు, న్యాయమూర్తి చిప్ప కుల భరత్‌కమల్‌కు, టోబీప్ అవార్డు ఎయిమ్స్ వైద్య సంస్థల ఛైర్మన్ బొమ్మల రామలింగేశ్వరరావు, సూపర్‌కిడ్ అవార్డును పల్లెపు ధనుశ్రీకి మంత్రి స్వామి చేతులమీదుగా ప్రదానం చేశారు.

జేసీఐ అధ్యక్ష, కార్య దర్శులు కె.వరుణ్‌కుమార్, బి.శ్రీకాంత్, నరేంద్రల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.ప్రకాష్ బాబు, ప్రతిభ విద్యాసంస్థల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లు, వారోత్సవాల ఛైర్మన్ శబరి పి.నాయర్, సాత్విక్‌రాజ్, కె.శివకోటిరెడ్డి, శేఖర్‌బాబు, డాక్టర్ టి.రవి, గోరంట్ల రవికు మార్, డి.రమణారెడ్డి, బొమ్మల శ్రీనివాస్, వీవీ.రమణ, కసిబిసి నాగేశ్వరరావు, జేసీఐ సభ్యులు పాల్గొన్నారు.

అలా వదిలేశారు!



- వైద్యారోగ్యశాఖ ఉద్యోగ నియామకాల్లో అక్రమాలు
- వైసీపీ హయాంలో 41 మందికి నిబంధనలకు విరుద్ధంగా కొలువులు
- రెండు నెలలపాటు విచారించి నివేదిక సమర్పించిన అధికారుల కమిటీ
- బుట్టదాఖలు చేసిన ఉన్నతాధికారులు
- అందుకు ప్రతిగా భారీ మొత్తంలో ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు

జిల్లా వైద్యారోగ్యశాఖలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఉద్యోగ నియామకాల్లో అప్పటి అధికారులు అడ్డగోలుగా వ్యవహరించారు. ఒక్కో పోస్టుకు రేటు నిర్ణయించి అమ్ముకున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో విచారణకు ఆదేశించారు. అందులో విస్తుపోయే అనేక నిజాలు వెలుగు చూశాయి. స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాలు 41 మంది అనర్హులకు కట్టబెట్టినట్లు తేలింది. వారి పేర్లను కూడా విచారణ కమిటీ నివేదికలో పొందుపరిచి ఉన్నతాధికారులకు సమర్పించింది. కానీ ఇప్పటి వరకూ చర్యలు కరువయ్యాయి. ఉన్నత స్థాయిలో ఈ ఫైల్‌ను తొక్కిపెట్టినట్లు తెలుస్తోంది. అందుకోసం భారీ మొత్తంలోనే డబ్బులు చేతులుమారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 15 : వైద్యారోగ్యశాఖ అధికారులు గత వైసీపీ పాలనలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారు. ఉద్యోగాలను సైతం అమ్ముకున్నారు. ముఖ్యంగా 2020లో కరోనా సమయంలో చేపట్టిన అత్యవసర నియామకాల్లో చేతివాటం చూపించారు. 300 పోస్టులకు పైగా భర్తీ చేసిన వారు అందులో కొన్ని పోస్టులను అనర్హులకు కట్టబెట్టారు. దీనిపై అటు కలెక్టర్‌కు, ఇటు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

విచారణకు నలుగురు అధికారులతో కమిటీ

వైద్యారోగ్యశాఖలో ఉద్యోగ నియామకాల్లో అక్రమాలపై గత ఏడాది అక్టోబరులో విచారణకు ఉన్నతాధికారులు ఆదేశించారు. అప్పటి జడ్పీ సీఈవో జాలిరెడ్డి నేతృత్వంలో నలుగురు అధికారులతో అప్పటి కలెక్టర్ కమిటీని ఏర్పాటు చేశారు. దీంతో రంగంలోకి దిగిన వారు జిల్లా వైద్యారోగ్యశాఖలో ఉద్యోగాల నోటిఫికేషన్ నాటి నుంచి నియామక పత్రాలు ఇచ్చేంత వరకూ జరిగిన నోట్ ఫైళ్ల తోపాటు ఉద్యోగాల కోసం చేసిన దరఖాస్తులను కూడా పరిశీలించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలోనే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గదిలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వారికి అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఉద్యోగాల కోసం చేసుకున్న దరఖాస్తులు కనిపించని పరిస్థితుల నుంచి నివేదిక ఇచ్చేంత వరకూ ఒత్తిళ్లను ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు గతేడాది డిసెంబరులో అప్పటి కలెక్టర్ దినేష్‌కుమార్‌కు విచారణ నివేదికను అందజేశారు. స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ నియామకాల్లో 41 మంది అనర్హులకు ఉద్యోగాలు ఇచ్చినట్లు పేర్లతో సహా నివేదికలో పొందుపర్చారు. విచారణ నివేదికను పరిశీలించిన అప్పటి కలెక్టర్ దినేష్‌కుమార్ చర్యలు తీసుకోవాలని కోరుతూ వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులకు పంపారు. కానీ ఇప్పటి వరకూ చర్యలు కరువయ్యాయి. అయితే ఈ విచారణ నివేదికను వైద్యారోగ్యశాఖ రాష్ట్ర కార్యాలయంలో పనిచేసే ఒక అధికారి తొక్కిపెట్టినట్లు సమాచారం.

భారీగా చేతులు మారినట్లు ఆరోపణలు

విచారణ నివేదిక ఫైల్‌ను తొక్కిపెట్టడం వెనుక భారీగా చేతులు మారినట్లు ఆరోపణలున్నాయి. తమపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు అప్పట్లో పనిచేసిన అధికారులతోపాటు, ఉద్యోగులు కూడా ఉన్నతాధికారులకు పెద్దమొత్తంలో మామూళ్లను సమర్పించినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఉద్యోగ నియాకాల్లో ముగ్గురు డీఎంహెచ్‌వోలతోపాటు ఆరుగురు కార్యాలయ ఉద్యోగుల పాత్ర ఉంది. వీరితోపాటు ఉద్యోగాలు పొందిన 41 మంది అనర్హులు కూడా కలిసికట్టుగా రాష్ట్రస్థాయిలోనే ఫైల్ నిలిచిపోయేలా చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

కూటమి ప్రభుత్వమైనా చర్యలు తీసుకొనేనా?

గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగ నియామకాల్లో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై కూటమి ప్రభుత్వంలోనైనా చర్యలు ఉంటాయా? లేదా? అన్న చర్చ నడుస్తోంది. ఇటీవల ఈ విషయం అధికార పార్టీ ముఖ్యనేత వద్ద చర్చకు వచ్చినట్లు తెలిసింది. దీనిపై కూటమి నేతలు దృష్టి సారించి వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులతోపాటు సంబంధిత మంత్రితో చర్చించి తదుపరి చర్యలు తీసుకొనేలా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పొన్నలూరు సొసైటీలో భారీ అక్రమాలు



- ఆడిట్‌లో వెలుగు చూసిన ఆర్థిక అవకతవకలు
- మూడు దశాబ్దాలుగా పెండింగ్ బకాయిలు
- అధికారుల నిర్వాకంతో కుదేలు

ఒంగోలు (విద్య), సెప్టెంబరు 15 : పొన్నలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో భారీగా అక్రమాలు, ఆర్థిక అవకతవకలు, పరిపాలనా పరమైన లోపాలు జరిగాయి. సొసైటీలో లావాదేవీలపై 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన ఆడిట్‌లో అవి వెలుగుచూశాయి. ప్రారంభ నిల్వ, అంత్య నిల్వల్లో తేడాలు చూపించి లక్షలాది రూపాయలు గోల్‌మాల్ చేశారు. పాలకవర్గాలు, పర్సన్ ఇన్‌చార్జిలు, సహకారశాఖ అధికారులు, సీఈవోల నిర్వాహకంతో సొసైటీ ఆర్థికంగా కుదేలైంది. మూడు దశాబ్దాల క్రితం సొసైటీ నుంచి తీసుకున్న రుణాలు ఇప్పటికీ వసూలు కాకుండా వాయిదా మీరిన బకాయిలుగా మిగిలిపోయాయి. ఈ రుణాలకు సంబంధించి బాండ్ల కాల పరిమితి కూడా ముగియడంతో అవి ఇక వసూలయ్యే అవకాశం కనిపించడం లేదు. దీంతో సొసైటీ నష్టాల ఊబిలో కూరుకుపోయింది.

ఆర్థిక అక్రమాలు ఇవే..

- సొసైటీ నగదు పుస్తకాల్లో ప్రారంభ, అంత్య నిల్వలు, ఖర్చుల మొత్తాల్లో వ్యత్యాసంతో రూ.2.35 లక్షలు గల్లంతయ్యాయి.
- సీఈవో జీతాన్ని ఏఎస్‌సీఎఫ్ ఖాతా నుంచి డ్రా చేయాల్సి ఉండగా సొసైటీ నగదు పుస్తకం నుంచి నిబంధనలకు విరుద్ధంగా తీసుకున్నారు. ఈ ఏడాది జనవరి 29న రూ.65వేలు, ఫిబ్రవరి 28న రూ.62,680 డ్రా చేశారు.
- సొసైటీ షేర్ ధనంలో రూ.3.71 లక్షలు వ్యత్యాసం ఉంది. షేర్ క్యాపిటల్ లిస్టుకు, సొసైటీ చిట్టా పుస్తకంలో జమల వైపు నమోదు చేసిన దానికి వ్యత్యాసం ఉంది. షేర్ క్యాపిటల్ జాబితాలో సభ్యుల జనరల్ నంబర్ లేకుండానే షేర్ క్యాపిటల్ నమోదు చేశారు.
- పీడీసీసీ బ్యాంకు కందుకూరు శాఖకు చెల్లించాల్సిన షేర్ ధనం, చిట్టా పుస్తకంలో ఖర్చులు చూపించిన మొత్తానికి రూ.59,600 తేడా ఉంది. ఈమొత్తం గల్లంతైంది.
- బ్యాంకు కందుకూరు బ్రాంచిలో చెల్లించిన రుణానికి సంబంధించి అసలు, వడ్డీకి సొసైటీ నగదు పుస్తకంలో బ్యాంకుకు చెల్లించిన మొత్తంకు రూ.1.70 లక్షలు తేడా ఉంది.
- సొసైటీలో బినామీ రుణాలున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రైతులకు ఇచ్చిన రూ.8.15 లక్షల స్వల్పకాలిక రుణాలకు సంబంధించి రశీదు పుస్తకాల్లో ఉన్న పేర్లకు, సంఘ చిట్టా పుస్తకంలో నమోదైన పేర్లకు తేడా ఉంది.

మూడు దశాబ్దాలుగా మొండి బకాయిలు

సొసైటీలో మూడు దశాబ్దాలుగా వసూలు కాకుండా నిలిచిపోయిన బకాయిలు అనేకం ఉన్నాయి. 1992లో బట్వాడా చేసిన రుణాలు కూడా ఇప్పటికీ వసూలు కాకుండా మిగిలిపోయాయి. వీటికి సంబంధించిన బాండ్లకు కూడా కాల పరిమితి ముగిసింది. నిబంధనల ప్రకారం దీర్ఘకాలిక, వ్యవసాయేతర రుణాలకు సంబంధించి బాండు కాల పరిమితి 12 సంవత్సరాలు. అప్పటికి ఆ బకాయిలు వసూలు కాకపోతే వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకొనేందుకు ఒక సంవత్సరం గ్రేస్ పీరియడ్ ఇస్తారు ఆతర్వాత ఆ బకాయిలు వసూలు చేసేందుకు సొసైటీకి అధికారం ఉండదు. దీంతో ఆ మొత్తాలను రాని బాకీల పద్దు కింద చే రుస్తారు. స్వల్పకాలిక వ్యవసాయ రుణాలకు అయితే మూడు, నాలుగేళ్లలోపే బాండు కాలపరిమితి ముగుస్తుంది. నిర్ణీత గడువులోపే ఆ రుణాలపై లీగల్ చర్యలు చేపట్టి బకాయిలు రాబట్టాలి. ఆలా చేయని పక్షంలో ఆ బకాయిలను బ్యాంకు మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్, సంబంధిత క్లర్క్, సొసైటీల పాలకవర్గం, సీఈవోలను బాధ్యులుగా చేసి వారినుంచి రాబడతారు. సొసైటీ సీఈవో, బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం కారణంగా వసూలు కాని బకాయిలపై చట్టపరమైన చర్యలు తీసుకోలేదు. ఇదిలా ఉండగా నకిలీ పాసుపుస్తకాలు, బినామీ రుణాలు, బాండ్లలో అర్హతకు మించి రుణాలు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. గడువు లోపు చెల్లించని బకాయిలపై లీగల్ చర్యలు చేపడితే ఈ బాగోతాలు బయటపడతాయన్న భయంతోనే మిన్నకుండిపోయారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే ఏటా ఆడిట్ సమయంలో ఈ అవకతవకలన్నింటిని గుర్తించి నివేదికలు ఇవ్వాల్సి ఉంది. కానీ అది కూడా జరగలేదు. ఇందులో సహకార శాఖ అధికారుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది.. సహకార సంఘాల చట్టం సెక్షన్ 51 ప్రకారం స మగ్ర విచారణ నిర్వహిస్తే అసలు నిజాలు వెలుగులోకి వస్తాయి.

ప్రాణం తీసిన వేటగాళ్ల ఎర


మన్నెం వెంకటేశ్వర్లు (ఫైల్)

- విద్యుదాఘాతానికి రైతు మృతి
- అడవి పందుల కోసం కంచె వేసిన వేటగాళ్లు
- భయపడి శవాన్ని బావిలో పడేసిన వైనం

కొండపి, సెప్టెంబరు15: అడవి పందులకోసం వేసిన కంచె ఓ రైతు పాలిటి మృత్యు పాశమైంది. మండలంలోని మూగచింతల గ్రామానికి చెందిన అడవి పందుల వేటగాళ్లు విద్యుత్ కంచెను గ్రామ సమీప పొలాల్లో ఏర్పాటు చేశారు. అది గమనించని రైతు మన్నెం వెంకటేశ్వర్లు (40) శనివారం రాత్రి పొలానికి వెళ్లి విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మరణించాడు. కంచెలో ఓ అడవి పంది, జింక కూడా పడింది. ఎర వేసిన వేటగాళ్లు గమనించి భయపడి రైతు శవాన్ని సుదూరంగా ఉన్న పొలాల్లోని బావిలో పడేశారు. తర్వాత ఏమీ ఎరగనట్టు వారు గ్రామంలోకి వచ్చారు. ఎంతకూ వెంకటేశ్వర్లు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు శనివారం రాత్రి, ఆదివారం ఉదయం వెతుకులాడి ఆచూకీ దొరకపోవడంతో కొండపి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చారు.

సమస్య జటిలం అవుతుండటంతో వేటగాళ్లు విషయాన్ని గ్రామ పెద్దలకు తెలియజేశారు. తాము భయపడి అలా చేశామని వాపోయారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంకటేశ్వర్లును పడేసిన బావిలో నుంచి శవాన్ని వెలుపలకు తీసి ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణబాజీబాబు తెలిపారు.

ధర్మవరంలో కొనసాగుతున్న పోలీస్ పికెట్


ధర్మవరంలో పరిశీలిస్తున్న సిఐ కృష్ణయ్య

- ఆగని వైసీపీ ఆగడాలు
- టీడీపీ నాయకునికి ఫోన్ చేసి బెదిరింపు
- పార్టీ మండల మాజీ అధ్యక్షుడి కారు అద్దాలు ధ్వంసం

అద్దంకి, సెప్టెంబరు 15 : మండలంలోని ధర్మవరంలో ఆదివారం కూడా పోలీస్ పికెట్ కొనసాగుతుంది. ధర్మవరంలో శుక్రవారం రాత్రి టీడీపీ వర్గీయుల వినాయక విగ్రహం నిమజ్జన ఊరేగింపు సందర్భంగా వైసీపీ వర్గీయులు రెచ్చిపోయి విద్యుత్ సరఫరా నిలిపి వేసి రాళ్ళు, కర్రలతో దాడి చేయడంతో 12 మంది టీడీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. అనంతరం టీడీపీ వర్గీయులు కోపంతో వైసీపీ వర్గీయుల ఆస్తులను ధ్వంసం చేశారు. అయితే అప్పటికే పోలీస్ లు ధర్మవరం చేరుకోవడంతో భారీ ఆస్తి నష్టం జరగకుండా నివారించగలిగారు. ఎలాంటి గొడవలు జరుగకుండా ఉండేందుకు పోలీస్ పికెట్‌ను కొనసాగిస్తున్నట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు. ధర్మవరంలో ఆదివారం సీఐ పరిశీలించారు.

వైసీపీ వర్గీయుల ఆగడాలు

ఒక వైపు వైసీపీ వర్గీయుల దాడులతో టీడీపీ కార్యకర్తలు 12 మంది గాయపడి వైద్యశాలలలో చికిత్స పొందుతుండగా, పోలీస్ పికెట్ కొనసాగుతున్నప్పటికీ ధర్మవరం వైసీపీ నాయకులకు మద్దతుగా శంఖవరప్పాడుకు చెందిన వైసీపీ శ్రేణులు వ్యవహరించడం తీవ్ర విమర్శలకు తావిస్తుంది. ధర్మవరానికి చెందిన టీడీపీ నేత చాగంటి రాజేంద్రకు శంఖవరప్పాడు(రెడ్డిపాలెం)కు చెందిన పలువురు వైసీపీ శ్రేణులు శనివారం రాత్రి ఫోన్ చేసి బెదిరించడం, తమ గ్రామంలో గుండా ఎలా వెళ్తావో చూస్తామని, చంపుతామని కూడా హెచ్చరించినట్లు తెలుస్తుంది. ఈ విషయాలను రాజేంద్ర పోలీస్ అధికారుల దృష్టికి తీసుకు పోవటంతో ఒకింత అప్రమత్తమై పోలీస్‌లు శంఖవరప్పాడు వెళ్లి హెచ్చరికలు చేశారు. రాజేంద్రను బెదిరించిన విషయం తెలుసుకున్న పలు గ్రామాల టీడీపీ నాయకులు వెంటనే శంఖవరప్పాడు వెళ్లేందుకు సిద్ధం కాగా సీఐ కృష్ణయ్య వారించడంతో ఆగిపోయినట్లు తెలుస్తుంది. అదే సమయంలో శనివారం రాత్రి శంఖవరప్పాడుకు చెందిన టీడీపీ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు పోతిరెడ్డి శ్రీనివాస రెడ్డికి చెందిన కారు అద్దాలు కూడా ధ్వంసం కావడం కూడా చర్చనీయాంశంగా మారింది. వైసీపీ శ్రేణులే అద్దాలు పగులగొట్టి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీస్ అధికారులు మరింత కఠినంగా వ్యవహరించకపోతే ఫ్యాక్షన్ రాజకీయాలు పెరిగే అవకాశం కూడా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా


పోలీసుల అదుపులో ఉన్న అక్రమ ఇసుక ట్రాక్టర్లు

- అధికారులకు సవాల్‌గా మారుతున్న అక్రమార్కులు

చీరాల, సెప్టెంబరు 15 : ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. అక్రమార్కులు అధికారులకు సవాల్‌గా మారుతున్నారు. ప్రభుత్వ ఉచిత ఇసుక విధానానికి తూట్లు పొడుస్తున్నారు. చీరాల మండలం ఈపురుపాలెం పోలీసులు శనివారం అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. చీరాల మండలం గవినివారిపాలెంకు చెందిన బుర్ల సాంబశివరావు, పుల్లాయిపాలెంకు చెందిన నక్కల ఏసోబు రెండు ట్రాక్టర్లతో ఇసును అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. నక్కల శ్రీను అనే వ్యక్తికి చెందిన పొలం నుంచి ఇసుకను తవ్వి అక్రమంగా తరలిస్తున్న క్రమంలో పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్లను, ఇసుక ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. అంతకు ముందురోజు కీర్తివారిపాలెంకు చెందిన నర్రా బ్రహ్మయ్యపై ఇసుక అక్రమ తవ్వకం, రవాణాపై కేసు నమోదైంది. ఒక వైపు అధికారులు నిఘా పెడుతున్నా వారి కళ్లుగప్పి అక్రమార్కులు తమపని చక్కపెట్టుకుంటున్నారు.

నామమాత్ర చర్యలే కారణం

ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు సంబంధించి పట్టుబడ్డ వారిపై తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగా ఉండడంతో ఒకరిని చూచి మరొకరు ఆ దందా సాగిస్తున్నారు. పట్టుబడ్డ వాహనాలు, డ్రైవర్లపై పటిష్టమైన చర్యలు చేపడితే మరొకరు అలాంటి చర్యలకు పాల్పడకుండా ఉంటారు. విధించే జరిమానాల మొత్తం కూడా భారీగా ఉండాల్సిన అవసరం ఉంది. అప్పుడే అక్రమార్కులు వెనకడుగు వేస్తారు.

పోలీస్, రెవెన్యూ సంయుక్త తనిఖీలు

ఇసుక అక్రమార్కులు అంతిమంగా స్ట్రయిట్‌కట్ కరకట్టలను కూడా వదలకుండా తవ్వకాలు సాగించడం పరాకాష్ట. ఈ క్రమంలో ఏఎస్పీ విఠలేశ్వర్, ఆర్డీఓ సూర్యనారాయణరెడ్డి, చీరాల మండల తహసీల్దార్ గోపికృష్ణ, రూరల్ సీఐ సత్యనారాయణ ఇతర అధికారులు, సిబ్బంది కరకట్టలను తవ్విన ప్రదేశాలను ఒకటికి, రెండు పర్యాయాలు పరిశీలించారు. అక్రమార్కులకు హెచ్చరికలు జారీ చేశారు.

ఇప్పటికి కొందరిని గుర్తించారు. మరికొందరిని గుర్తించాల్సి ఉంది. బాధ్యులపై చర్యలు చేపడితేనే మరొకరికి భయం ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. అందుకు అనుగుణంగా అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం.

19లోపు పీజీ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 15: ఒంగోలులోని దామచర్ల సక్కుబాయమ్మ ప్రభు త్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సులో చేరేందుకు ఈనెల 19వ తేదీలోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. కళ్యాణి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఏపీపీజీసెట్-24 రెండు, తుదిశ దశ వెబ్ ఆధారిత నమోదు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీఎస్సీ కంప్యూటర్, బీసీఏ డిగ్రీ పూర్తి చేసిన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వెబ్ ఆప్షన్లు ఈనెల 23 నుంచి 25లోపు చేసుకోవాలని, వెబ్‌ఆప్షన్ల మార్పు ఈనెల 26న, సీట్ల కేటాయింపు 28న జరుగుతుందని, 30వ తేదీలోపు కళాశాలలో రిపోర్టు చేయాల్సి ఉంటుందని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

గంగమ్మ ఒడికి గణపతి



మోటుపల్లి తీరంలో గంగమ్మ చెంతకు చేరిన కడవకుదురు గణనాథుడు

- కోలాహలంగా నిమజ్జన వేడుకలు
- విఘ్నాలు లేకుండా అందరికీ మంచి జరగాలి
- ఎమ్మెల్యే కొండయ్య

అన్ని మండలాల్లోని గ్రామాల్లో వినాయక చవితి నవరాత్రులు వైభవంగా ముగిశాయి. ఆదివారం పెద్ద సంఖ్యలో గణనాథులను భారీ ఊరేగింపుగా తీసుకెళ్లి గంగమ్మ ఒడికి చేర్చారు.

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 15 : విఘ్నాలు లేకుండా ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య గణనాధుడిని వేడుకున్నారు. మండల పరిధిలోని కొత్తపేట శ్రీనివాసపురంలో ఏర్పాటు చేసిన వినాయకుని పందిరిలో ఆదివారం జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు. స్వామివారికి హారతులు ఇచ్చి పూజలు చేశారు. అనంతరం రావూరిపేటలో జరుగుతున్న గణపతి నవరాత్రుల ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొన్ని అన్నదానంను ప్రారంభించారు. తదనంతరం శ్రీకనక నాగవరపమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నప్రసాదం స్వీకరించారు. రాత్రికి చీరాల పట్టణంలోని ఎంజీసీ మార్కెట్‌లోని వినాయక పందిరిలో, నల్లగాంధీ బొమ్మ సెంటర్లో ఏర్పాటు చేసిన వినాయక పందిరిలో తదితర చోట్ల పూజా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీల సభ్యులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సందడే సందడి

అద్దంకి : వినాయక వి గ్రహాల నిమజ్జనోత్సవాల ఊరేగింపులతో ఆదివారం అద్దంకి పట్టణంలో సందడి గా మారింది. అద్దంకి పట్టణంలోని పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాల ఊరేగింపులు ఆదివారం పెద్ద ఎత్తున జరిగాయి. అద్దంకి పట్టణంలోని శ్రీనగర్, కాకానిపాలెం, రామ్‌నగర్, గాజులపాలెం, గాంధీబొమ్మసెంటర్, శ్రీరామ్‌నగర్ ఎస్టీ కాలనీ తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వినాయక వి గ్రహాలను అద్దంకి పట్టణంలో ఊరేగింపు చేసి గుండ్లకమ్మ నదిలో నిమజ్జనం చేశారు. మహిళలు, యువకులు , చిన్నారులు గులాములు కొట్టుకుంటూ ఉత్సాహం గా పాల్గొన్నారు.

బల్లికురవ, సెప్టెంబరు 15 : మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం గణేష్ నిమజ్జన వేడుకలు కోలా హాలంగా జరిగాయి. మండలంలోని ముక్తేశ్వరంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రమం వద్ద ఎస్ఐ జీవీ చౌదరి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నక్కబొక్కలపాడు, కొత్తపాలెం, కొణిదెనగ్రామాలలో గణేష్ నిమజ్జన వేడుకలు వైభవంగా జరిగాయి. ఈసందర్భంగా ప్రత్యేక డప్పు వాయిద్యాలను ఏర్పాటు చేసి యువత నృత్యం చేశారు. అనంతరం సమీపంలో ఉన్న ఏబీసీ కాలువలో గణనాధుడిని నిమజ్జనం చేశారు.

బైబై గణేశా

చినగంజాం : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు ఆదివారం మోటుపల్లి, బాపయ్యనగర్, పెదగంజాం సముద్రతీర ప్రాంతాల్లో వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాలు సందడిగా సాగాయి. కడవకుదురు గ్రామంలోని కమ్యూనిటీ హాల్ వద్ద, తోటవారిసెంటర్‌లో పూజలు అందుకున్న గణనాథులు శనివారం రాత్రి నిమజ్జనానికి పయనమయ్యారు. నృత్యాలతో, బాణసంచా పేలుళ్లతో గ్రామ పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. కడవకుదురు, చినగంజాం, సంతరావూరు తదితర గ్రామాల్లో లంబోదరుడికి పూజలు నిర్వహించి, నిమజ్జనం కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు గ్రామాల్లో లడ్డుప్రసాదాలను వేలం వేశారు. మోటుపల్లి, బాపయ్యనగర్, పెదగంజాం సముద్రతీరంలో మండల పరిధిలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథులతో పాటు చుట్టుప్రక్కల మండలాలపరిధిలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. సముద్ర తీర ప్రాంతాలల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు

పంగులూరు : మండపాలలో కొలువుదీరిన గణనాధుని శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు అందచేశారు. పంగులూరులోని బొబ్బగుంటలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద పూజా కార్యక్రమాలు చేపట్టి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భగవాన్‌రాజుపాలెం, చందలూరు గ్రామాలలో గణనాధుని నిమజ్జన ఊరేగింపు ఉత్సవాలు మేళతాళలతో, బాణసంచా కాల్చుతూ ఘనంగా నిర్వహించారు. పంగులూరులోని బొబ్బగుంట మండపం వద్ద ప్రసాదం లడ్డూ వేలం నిర్వహించారు.

ప్రత్యేక ఆకర్షణగా జాగర్లమూడి వినాయకుడు

పర్చూరు : జై జై గణేష అంటూ వినాయక విగ్రహాల నిమజ్జన వేడుకలు పర్చూరు మండలంలో ఘనంగా నిర్వహించారు. డీజేలు, డప్పు వాయిద్యాలు, బాణసంచాలతో పర్చూరు బొమ్మల సెంటర్ కూడలి హోరెత్తింది. ఆయా గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వినాయక విగ్రహాలు పర్చూరుకు చేరడంతో ప్రధాన రహదారుల కూడలి జనసంద్రంగా మారింది. స్వామివారి విగ్రహాలను అలంకరించి ప్రత్యేక వాహనాల్లో నిమజ్జనానికి చీరాల వాడరేవు తరలించారు. యద్దనపూడి మండలం పెద్ద జాగర్లమూడి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. వాహనంపై ఎన్టీఆర్ కాంశ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూలతోరణాలతో సుందరంగా అలంకరించిన దృశ్యం అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంది. పర్చూరులోని తూర్పువారి వీధి, పడమటి వీధి, రామాలయం, కొట్లబజారు, బోడవాడ తదితర ప్రాంతాల లోని విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. మహిళలు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల భరతనాట్యం

అద్దంకి మాన్యంలో శ్రీ బాల గణేషుని విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ శాతవాహనా హైస్కూల్ సౌజన్యంతో నిర్వహించిన భరత నాట్య ప్రదర్శన అందరినీ అలరించింది. అనంతరం చిన్నారులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా స్వామి లడ్డు ప్రసాదాన్ని వేలంపాట పాడి పోత్రు శ్రీనాథ్ చౌదరి రూ.22,516కు దక్కించుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోటా ప్రసన్న, సందీప్ తేజ, తోట మణి, సిగనం బాస్కర్, మాజీ వైస్ సర్పంచ్ తులసి రాజా పాల్గొన్నారు.

నోట్ల అలంకరణ

మార్టూరు : మండలంలోని వలపర్ల గ్రామంలో ఆర్య వైశ్యులు ఏర్పాటుచేసిన వినాయకుని బొమ్మకు ఆదివారం లక్షా20వేల రూపాయల కరెన్సీ నోట్లతో అలంకరణ చేశారు. మండపంలో 500 నోట్లు, 100 నోట్లు తదితర నోట్లతో స్వామి వారిని అందంగా అలంకరణ చేశారు. భక్తులు ప్రత్యేకంగా పూజాకార్యక్రమాలను చేశారు. సాయంత్రం స్వామి వారిని గ్రామంలో ఊరేగింపుచేసి, సాగర్ కాలువకు తరలించి నిమజ్జనం చేశారు.









నిమజ్జనానికి తరలిన జాగర్లమూడి వినాయకుడు, అద్దంకిలో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు, మార్టూరులో నోట్ల అలంకరణలో గణపతి, పర్చూరులో చిన్నారుల నృత్య ప్రదర్శన



ఎమ్మెల్యే కొండయ్యకు విరాళాలను అందజేస్తున్న దాతలు

వరద బాధితులకు సహాయం

ఎమ్మెల్యే కొండయ్యకు విరాళాలు అందజేసిన దాతలు

చీరాల, సెప్టెంబరు 15 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం పలువురు విరాళాలను ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఆదివారం అందజేశారు. మురళీకృష్ణమూర్తి రూ.15,116, జి.రమేష్ రూ.10,116 అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య వారికి కృతజ్ఞతలు తెలిపారు. బాధల్లో ఉన్నవారికి ఓదార్పు, మనవంతు సాయం అందించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆహారం అందజేత

బల్లికురవ, సెప్టెంబరు 15 : విజయవాడ సింగునగర్ వరద బాధితులకు ఆదివారం బల్లికురవ మండలం కూకట్లపల్లి ఎస్సీ కాలనీవాసులు అహార ప్యాకెట్లను అందజేశారు. వారు మాట్లాడుతు మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపు మేరకు బాధితులకు తమవంతు చేయుత ఇచ్చేందుకు విరాళాలు సేకరించి ఆ నగదుతో రెండు వేల బిర్యానీ ప్యాకెట్లను అందజేసినట్లు తెలిపారు.

20న జాబ్ మేళా

అద్దంకిటౌన్, సెప్టెంబరు 15 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన అద్దంకిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా జరుగుతుందని జిల్లా నైపుణాభివృద్ధి అధికారి తమ్మజీరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాకు మాస్టర్‌మైండ్స్, కళామ్ టెక్స్టైల్స్, కేఎల్ గ్రూప్ (అమెజాన్), కంపెనీలు హాజరవుతాయని, 90కి పైగా ఖాళీలు ఉన్నాయని తెలిపారు. జీతం విద్యార్హతను బట్టి సూమారు 10వేల నుంచి 18 వేల వరకు ఉంటుందన్నారు. ఈ జాబ్ మేళాకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, బీఎస్‌సీ (కెమిస్ట్రీ), ఎంఎస్‌సీ (కెమిస్ట్రీ), ఎంబీఏ పీజీ విభాగాలకు చెందిన 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతి, యువకులు తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్టు ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9440635677, 7989697996, టోల్ ఫ్రీ నెంబర్ 9988853335 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా

బల్లికురవ, సెప్టెంబరు 15 : ఎలాంటి ఘర్షణలు జరగకుండా రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ జీవీ చౌదరి హెచ్చరించారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు ఎస్ఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా అయన వారితో మాట్లాడుతూ ఎలాంటి గొడవలకు పాల్పడకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. రౌడీషీటర్ల బయటకు వెళితే సమాచారం ఇవ్వాలన్నారు. ఘర్షణలలో పాల్గొన్నా, ప్రోత్సహించినా నాన్‌బెయిల్‌బుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పాల వ్యాన్ బోల్తా

బల్లికురవ, సెప్టెంబరు 15 : మండల పరిధిలోని బల్లికురవ - మార్టూరు అర్అండ్‌బీ రోడ్డులో ఆదివారం గోతులను తప్పించ బోయి పాల వ్యాను బోల్తా కొట్టింది. ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా, వ్యాను వెల్లకిలా పడింది. అందిన సమాచారం మేరకు.. గుంటూరు జిల్లా నుంచి పాలు తీసుకుని బల్లికురవ మండల కేంద్రానికి వస్తున్న పాల వ్యాను నక్కబొక్కలపాడు వద్దకు వచ్చే సరికి గోతుల రోడ్డు వలన తప్పించే క్రమంలో మార్జిన్‌లోకి వాహనం పల్టి కొట్టింది. ప్రమాద సమయంలో వాహనం లోపల పాల ప్యాకెట్ల లోడ్ ఉంది. వెంటనే స్థానికులు గమనించి డ్రైవర్‌ను బయటకు తీశారు. అనంతరం మరో వాహనం తీసుకు వచ్చి పాల ప్యాకెట్లను గ్రామాలకు తీసుకు వెళ్లారు. గోతుల రోడ్డు వలనే ప్రమాదం జరిగిందని, రోజూ వాహనాలు ఇలానే బోల్తా కొడుతున్నాయని ప్రయాణికులు తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో ఎనిమిది మందికి గాయాలు

చెరుకూరు(పర్చూరు), సెప్టెంబరు 15: మండలం చెరుకూరు గ్రామంలో ఆదివారం పిచ్చికుక్క దాడిలో 8మందికి తీవ్ర గాయాలయ్యాయి. పిచ్చికుక్క మూకుమ్మడిగా దాడిచేసి గాయపరచడంతో ప్రజలు ఒకింత ఆందోళనకు గురి అయ్యారు. పిచ్చికుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలతోపాటు బాపట్ల ప్రయివేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఒకే రోజు కుక్కల దాడిలో పెద్ద ఎత్తున ప్రజలు గాయాలు పాలు కావటంతో ఇంటి నుంచి చిన్నారులు బయటకు రావాలంతే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామంలో ప్రస్తుత పరిస్థితి నేపథ్యంలో ప్రజలు కుక్కల బెడదతో ఆందోళన చెందుతున్నారు.

టీడీపీ యువనేతపై వైసీపీ నాయకుడి దాడి



ఆసుపత్రిలో ఉన్న వినోద్

బల్లికురవ. సెప్టెంబరు 15 : పాత కక్షలను దృష్టిలో ఉంచుకొని ఉప్పుమాగులూరు గ్రామ టీడీపీ నేత అమరనేని వినోద్‌పై అదే గ్రామానికి చెందిన దేవినేని కృష్ణ అను వైసీపీ నేత బీరు సీసాతో దాడి చేసిన ఘటన ఆదివారం జరిగింది. అందిన సమాచారం మేరకు.. ఉప్పుమాగులూరుకు చెందిన టీడీపీ యువనేత వినోద్ వేమవరం జంక్షన్‌లో దుకాణంలో ఉండగా, అక్కడికి వచ్చిన వైసీపీ నేత దేవినేని కృష్ణతో వాదన జరిగింది. దీంతో వినోద్‌ను సీసాతో దాడి చేయగా తలకు బలమైన గాయం కావడంతో వెంటనే గుంటుపల్లి వైద్యశాలకు తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఈపూరుపాలెంలో మూడు కేసులు నమోదు

చీరాలటౌన్, సెప్టెంబరు 15 : ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం మూడు కేసులు నమోదు చేశారు. కావూరివారిపాలెంకు చెందిన పిట్టు రవీంద్రరెడ్డి తన భార్య అమ్మమ్మపై దాడికి పాల్పడడంతో ఆమె గాయపడింది. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అలాగే పిట్టువారిపాలెంకు చెందిన ఓ వ్యక్తి అదే గ్రామంలోని ఓ ఇంట్లోకి అక్రమంగా రాత్రి సమయంలో చొరబడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అంతేకాకుండా వాడరేవులో భర్త వేధిస్తున్నాడని భార్య ఫిర్యాదు చేయడంతో అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ యోగాకు చందలూరు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో పీడీ

పంగులూరు, సెప్టెంబరు 15 : మండలంలోని చందలూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 14, 15 తేదీలలో ఏపీ యోగాసనం, స్పోర్ట్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో విశాఖ యోగా స్పోర్ట్స్ అసోషియేషన్ నిర్వహించిన 49వ రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో చందలూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. 12 నుంచి 14 సంవత్సరాల విభాగంలో జరిగిన యోగాసన పోటీలలో పాల్గొన్న పాఠశాల ఏడవ తరగతి విద్యార్థిని శ్రుతి, మంగిశెట్టి వెంకటేష్ నైపుణ్యాన్ని ప్రదర్శించి ఎంపికయ్యారు. ఈ ఇద్దరు విద్యార్థులు యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అక్టోబర్ 22న హిమాచల్‌ప్రదేశ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి యోగాసన పోటీల్లో పాల్గొంటారని ఫిజికల్ డైరెక్టర్ కొండా ప్రతిమ తెలిపారు. ఈ సందర్భంగా శ్రుతి, వెంకటేష్, పీడీ ప్రతిమను ఎస్ఎంసీ ఛైర్మన్ గొట్టిపాటి హరికృష్ణ, హెచ్ఎం చందలూరి గిరిజ, అజిత్‌కుమార్, ట్రస్ట్ ఛైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ, గ్రామ పెద్దలు పెంట్యాల రామలింగస్వామి, అడ్డగడ సుబ్బయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.



ఏఈ బాలకోటేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న సభ్యులు

ఘనంగా ఇంజనీర్స్ డే

అద్దంకిటౌన్, సెప్టెంబరు 15 : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఆదివారం ఇంజనీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏఈ వి.బాలకోటేశ్వరరావు నివాసంలో ఏఈతో కలిసి రోటరీ క్లబ్ సభ్యులు కేట్ కట్ చేశారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జాతికి చేసిన సేవలను కొనియారు. ఇంజనీర్స్‌గా ఆయా రంగాలలోని వ్యక్తులు అందిస్తున్న సేవలను సభ్యులు కొనియాడారు. గతంలో మానవుడికి రోటి, కపడా, మకాన్ అనేవి మూడు తప్పని అవసరాలు అయితే ప్రస్తుతం మానవుడికి విద్యుత్ కూడా నాల్గవ నిత్యసరమయిందని ఏఈ బాలకోటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా బాలకోటేశ్వరరావు దంపతులను రోటరీ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, కార్యదర్శి చుండూరి మురళిసుధాకరావు, కోశాధికారి మలాది శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చౌదరి సేవలు ఎనలేనివి

చీరాలటౌన్, సెప్టెంబరు 15 : ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచి తనదైన సేవలు అందించిన పీవీఆర్ చౌదరి సేవలు ఎనలేనివని సీపీఐ నాయకులు అన్నారు. ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయలంలో ఒంగోలు సీపీఐ పట్టణ కార్యదర్శి చౌదరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన అకాల మరణంపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల శామ్యేల్, మేడా వెంకటరావు, కోటి దాసు, బాబురావు, పైడయ్య, ప్రకాష్, వీరాంజనేయులు, పున్నారావు, షరీఫ్ పాల్గొన్నారు.

నాగేశ్వరరావు మృతికి సంతాపం

ఇంకొల్లు, సెప్టెంబరు 15 : మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన సుపరిచితుడైన ముళ్ల నాగేశ్వరరావు(66) మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. నాగేశ్వరరావు యుక్త వయస్సులో కమ్యునిస్టు పార్టీలో చేరి పనిచేశారు. అనంతరంది విజయ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం సెక్రటరీగా ఉన్నారు. గంగవరంలో సొంత స్థలంలో దాతల సహకారంతో వెంకటేశ్వస్వామి దేవాలయాన్ని నిర్మించారు. ఆయన మృతి పట్ల ఆదివారం పలువురు సంతాపం తెలిపారు.

పోలీస్ స్టేషన్‌కు ఎక్స్‌కవేటర్

మార్టూరు, సెప్టెంబరు 15 : మండలంలోని ద్రోణాదుల గ్రామంలో గ్రావెల్ కొండలో అక్రమంగా గ్రావెల్‌ను తవ్వుతున్న ఎక్స్‌కవేటర్‌ను గ్రామ వీఆర్‌వో అదుపులోకి తీసుకున్న సంఘటన ఆదివారం జరిగింది. వీఆర్‌వో స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు గ్రావెల్ కొండ వద్దకు చేరి ఎక్స్‌కవేటర్‌ను స్టేషన్‌కు తరలించారు.

ఇసుక అక్రమ రవాణాపై కేసు

చీరాలటౌన్, సెప్టెంబరు 15 : అక్రమంగా రెండు ఇసుక ట్రాక్టర్‌లు రవాణా సాగిస్తుండడంపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ భూషణం తెలిపిన వివరాల ప్రకారం వేటపాలెం వైపు నుంచి జాతీయ రహదారిలో మన్నం అపార్ట్‌మెంట్ వైపు వస్తున్న ట్రాక్టర్‌లపై దాడులు నిర్వహించారు. అలాగే రెండింటిపై కేసు నమోదు చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

నాయుడమ్మను పరామర్శించిన బలరాం

ఇంకొల్లు, సెప్టెంబరు 15 : ఇంకొల్లుకు చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు కొల్లూరి నాయుడమ్మను మాజీ ఎమ్మెల్యే కరణం బలరాంకృష్ణమూర్తి పరామర్శించారు. కొల్లూరి నాయుడమ్మ కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురికావడంతో ఇంకొల్లులో స్వగృహంలో ఉన్న నాయుడమ్మను బలరాంతో పాటు పలువురు ప్రముఖులు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట పున్నయ్యచౌదరి, హనుమయ్య, హరిబాబు ఉన్నారు.

ఔషధ మొక్కల పంపిణీ

అద్దంకిటౌన్, సెప్టెంబరు 15 : స్వయం జ్యోతి మహిళా మండలి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఔషధ మొక్కల బోర్డు సహకారంతో ఆదివారం బొమ్మనంపాడు, చెరువుకొమ్ముపాలెం గ్రామాలలోని రైతుల, మహిళలకు ఉచితంగా ఔషధ మొక్కలను పంపిణీ చేశారు. ఎర్రచందనం, రణపాల, ఉసిరి, తమలపాకు, ఇన్సూలిన్ ప్లాంట్, నల్లేరు, నిమ్మగడ్డి వంటి మొక్కలను రైతులకు అందజేశారు. ఔషధ మొక్కలు ఉపయోగాలను ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి వాటిని పెంచుకోవాలని బి. కీర్తన తెలిపారు. కార్యక్రమంలో రి సోర్స్ పర్సన్ కిరణ్‌చంద్, శర్మ లు వివిధ రాష్ట్రాలల్లో, ఇతర దేశాలలో ఔషధమొక్కల గిట్టుబాటు ధర, డిమాండ్‌లను, కంపెనీల అడ్రస్‌లను రైతులకు అందజేశారు.

మంత్రి ఆదేశించినా.. కదలని మున్సిపల్ అధికారులు



అద్దంకిలోని ఆయిల్ మిల్ రోడ్డు వద్ద మురుగుతో నిండిన ఎన్నెస్పీ కాలువ

- మురుగు పారుదల పై సారించని దృష్టి
- వ్యాధులు వచ్చే అవకాశం
- ఆందోళనలో ప్రజలు

అద్దంకి, సెప్టెంబరు 15 : సాగు నీరు పారాల్సిన ఎన్ఎస్‌పీ కాలువ కాస్తా అద్దంకి పట్టణం విస్తరించడంతో మురుగు కాలువగా మారింది. అయితే మురుగు నీరు పారుదల లేకపోవడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నెల రోజుల క్రితం ఆయిల్ మిల్ రోడ్డులో ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మురుగును చూసి ఒకింత ఆశ్చర్యపోయారు. వెంటనే మురుగు పారుదలకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ అధికారులు మాత్రం మురుగు నీరు పారుదలపై దృష్టి పెట్టకుండా మొక్కుబడి చర్యలు తీసుకున్నారు. దీంతో మరలా యథావిధిగా మురుగు నీరు నిలిచే ఉంది. గతంలో ప్రతి ఏటా ఒక సారి ఆయిల్ మిల్ రోడ్డు వద్ద నుంచి రామ్‌నగర్ గ్యాస్ గోడౌన్ వరకు కాలువ పూడిక తీత చేస్తుండడంతో కొంత మేర మురుగు నీరు పారేవి. అయితే గత రెండు సంవత్సరాలుగా కాలువ పూడిక తీత చేపట్టకపోవటంతో మురుగు నీరు అసలు ముందుకు కదలకుండా నిలిచిపోయాయి. పలు చోట్ల మురుగు నీరు పారుదలకు అవకాశం లేకుండా కాలువను స్థానికులు ఆక్రమించి ఎత్తులేపడంతో మురుగు నీటికు ఆటంకం ఏర్పడింది. దీంతో దుర్వాసన మరింత పెరిగిపోయిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఎన్ఎస్‌పీ కాలువ కట్టను మినీ బైపాస్ రోడ్డు గా అభివృద్ధి చేసే ప్రతిపాదనలు కార్యరూపం దాల్చేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున ఈ లోపుగా కనీసం తాత్కాలికంగానైనా మురుగు నీరు పారుదల జరిగే విధంగా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. మంత్రి రవికుమార్ ఆదేశించినా మున్సిపల్ అధికారులు మొక్కుబడి చర్యలతో సరిపెట్టడం పట్ల స్థానికులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

లీజుకు మార్టూరు ఆర్టీసీ బస్టాండ్

మార్టూరు,సెప్టెంబరు 15 : ఎంతో కాలం నుంచి బస్సులు రాక, ప్రయాణికులు వెళ్లకుండా ఖాళీగా ఉన్న మార్టూరు ఆర్‌టీసీ బస్టాండును లీజుకు ఇచ్చేందుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ఆహ్వానిస్తున్నట్లు ఆదివారం అద్దంకి ఆర్‌టీసీ డీఎం రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌టీసీ బస్టాండులో ఖాళీగా ఉన్న 3792 చగజాలు ప్రదేశాన్ని 15 ఏళ్లకు లీజు పద్ధతిలో ఇవ్వడానికి టెండరుదారులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 29వ తేదీ లోపు ఆన్ లైన్‌లో దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 30 వతేదీ ఉదయం 10.30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 2 గంటలలోపు జోన్ 3, ఈడీ ఆఫీస్, నెల్లూరు కార్యాలయంలో టెండరు బాక్సులో వేయాలని రామ్మోహనరావు తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండరుదారుల సమక్షంలో టెండర్లను ఓపెన్ చేస్తామన్నారు. అదేవిధంగా స్థలాలు లీజుకు తీసుకునేవారికి అవగాహన కోసం ఈ నెల 21న ఉదయం 11 గంటలకు చీరాల ఆర్‌టీసీ బస్టాండు నందు ఏఎం (టి) ఆఫీసులో అవగాహనా సదస్సును ఏర్పాటు చేశామని తెలిపారు.



విజేతలుగా నిలిచిన మండలానికి చెందిన ఉపాధ్యాయులు

సత్తాచాటిన ఉపాధ్యాయులు

మార్టూరు, సెప్టెంబరు 15 : యూటీఎఫ్ యాభై ఏళ్ల స్వర్ణోత్సవాలు సందర్భంగా శనివారం చీరాలలో ఉపాధ్యాయులకు జరిగిన ఆటల పోటీలలో మార్టూరు డివిజన్‌కు చెందిన ఉపాధ్యాయులు ప్రతిభ కనబరిచారు. మార్టూరు మండలానికి చెందిన ఉపాధ్యాయులు పలు పోటీలలో విజేతలుగా నిలిచారు. మండలానికి చెందిన ఉపాధ్యాయుడు కే జాకబ్ వంద మీటర్లు, 200 మీ.ల పరుగు పందెంలో ద్వితీయ స్థానాన్ని, షాట్‌పుట్‌లో రెండవ స్థానాన్ని, జావెలిన్‌త్రోలో మొదటి స్థానాన్ని సాధించారు. అదేవిధంగా పీ జానీబాషా షాట్‌పుట్‌లో ప్రథమ స్థానాన్ని, జావెలిన్ త్రోలో రెండవ స్థానాన్ని పొందారు. చెస్ పోటీలలో ప్రథమ స్థానాన్ని జీ రామకోటేశ్వరరావు, క్యారమ్స్ డబుల్స్‌లో జిలాని, ప్రశాంత్ మొదటి స్థానాన్ని, షటిల్ డబుల్స్‌లో జాకబ్, జానీబాషా మొదటి స్థానాన్ని సాధించారు. ఈ పోటీలలో విజేతలైన వారందరూ వచ్చే నెల 4,5,6 తేదీలలో గుంటూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారు. ప్రతిభ చూపిన వారిని ఆదివారం మార్టూరులో యూటీఎఫ్ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో సునీల్‌కుమార్, ప్రతాప్, ఆదినారాయణ, రవిబాబు, అన్నపూర్ణాదేవి, మౌలాలి, ఈశ్వరప్రసాద్ పాల్గొన్నారు.



టెన్త్ పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ఇంకొల్లు, సెప్టెంబరు 15 : పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక అందరినీ ఆనందపరవశంలో ముంచింది. 44 సంవత్సరాల కిందట 1981వ సంవత్సరంలో ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ప్రస్తుతం వివిధ వృత్తులలో స్థిరపడ్డారు. వారంతా ఒకే వేదికపై కలవడం అభినందనీయమని విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు అన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 1981లో పదవ తరగతి చదివిన విద్యార్థులందరూ కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పూర్వ విదార్థులు కాశీవిశ్వనాథం, సత్యనారాయణ, బ్రహ్మం, వలిని ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారి అజయ్‌బాబు, ప్రధానోపాధ్యాయుడు షేక్ మస్తాన్‌వలి, చుండూరి శివరామకృష్ణ, ప్రవాసాంధ్రుడు కరి సుబ్బారావు, తూమాటి శ్రీనివాసరావు, పొన్నగంటి సుధారాణి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని తీర్మానం

మార్టూరు, సెప్టెంబరు 15 : మార్టూరు గ్రామంలో పలు సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మార్టూరు కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఆదివారం మార్టూరులో సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం మార్టూరు గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు సీహెచ్, మజుందార్, మండల కమిటీ నాయకులు బత్తుల హనుమంతరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మార్టూరులో డ్రైనేజీ సమస్యలను, తాగునీటిని కుళాయిల ద్వారా ప్రతిరోజు ఇవ్వాలని, జాతీయరహదారి పక్కన సర్వీసు రోడ్లను బాగుచేయాలని, బోర్ల రిపేరు, ఇంకా తదితర సమస్యలను పరిష్కరించాలని తీర్మానం చేశారు. అనంతరం మార్టూరు గ్రామ కార్యదర్శిగా వైరాంబాబును ఏక గ్రీవంగా ఎంపిక చేశారు.